# విశ్వాసం → విజయం




## భగవాన్ శ్రీ వెంకయ్య స్వామి వారి మహిమలు

Rs.10/-

ప్రథమ ముద్రణ : 19 Dec 2025

ప్రతులకు :

శ్రీ సాయి మాస్టర్ సేవా ట్రస్ట్

శ్రీ సాయి మాస్టర్ నిలయం, గొలగమూడి – 524321

నెల్లూరు, ఆంధ్రప్రదేశ్, Ph -7019123548

వెల : రూ. 10/-

సంకలనం : నాగేష్ కానూరు

Contact: naageshk26@gmail.com

website: www.saimastersevatrust.org

ముద్రణ :

శ్రీ సాయి మాస్టర్ నిలయం, గొలగమూడి – 52432,

నెల్లూరు, ఆంధ్రప్రదేశ్.

అగ్ని ప్రవేశిస్తే ఎలాంటిదైనా కాలి పోవాల్సిందే. వెంకయ్యస్వామి వారనే అగ్ని ప్రవేశిస్తే మనలోని కర్మలు దహించబడి బూడిద కావాల్సిందే, ఆనందం, ధైర్యం, విశ్వాసం వెల్లువలా రావాల్సిందే. ఆ అగ్ని మామూలు అగ్ని కాదు – దావాగ్ని! మన కర్మలు- దాని ముందు దూది పింజలు!

శ్రీ కర్ణం సుబ్బరాయుడు వారి కుటుంబం,
కలువాయి మండలం,
నెల్లూరు జిల్లా.

భగవాన్ వెంకయ్య స్వామి వారితో మూడు తరాల అనుబంధం ఎలా పెనవేసుకుందో ఈ క్రింది లీలల ద్వారా మనకి తెలుస్తుంది. శ్రీ వెంకయ్య స్వామివారు తనపై విశ్వాసముంటే ఎటువంటి పరిస్థితుల్లోనైనా విజయం వరిస్తుందని నిరూపించే ఈ అనుభవాలు మన మనసుకు హత్తుకుంటాయి. ఈ లీలలో మొదటి తరం ఐన మదినేని తిరుపాలయ్య గారికి శ్రీ వెంకయ్య స్వామివారంటే ఎంతో భక్తి , విశ్వాసం. అతని కుమార్తె శ్రీమతి కర్ణం సుజాత గారు , వీరి కుమార్తె కుమారి లేఖన - వారి జీవితాలకి వెంకయ్య స్వామి వారు మూల స్తంభం లా నిలబడ్డారో క్రింద వివరించారు.

శ్రీమతి కర్ణం సుజాత ఇలా చెపుతున్నారు :

*మగ సంతానం :*

మా నాన్నకు మేము నలుగురు ఆడ పిల్లలం, మగ సంతానం కోసం వెంకయ్య స్వామి వారి దగ్గరికి మా నాన్న వెళ్లారు. అప్పుడు వెంకయ్య స్వామి వారు ప్రశ్నలు చెప్పేవారు ,రెండు రూపాయలు తీసుకునేవారు. మా నాన్న ను పోయి రాళ్లు తెచ్చుకో అన్నారంట ఎన్ని అనేది చెప్పలేదు. మా నాన్న ఒక చేత్తో నాలుగు రాళ్లు, రెండో చేతితో రెండు రాళ్లు తీసుకొచ్చారు స్వామివారు నాన్న చేతిలోంచి ఆ రెండు తీసుకొని ఒక రాయి విసిరేసి ఒక్క రాయి మాత్రం వెనక్కి ఇచ్చారంట. అప్పుడు మా నాన్నకి ఏమీ అర్థం కాలేదు వచ్చేసారు . తర్వాత మా నాన్నకి ఇద్దరు మగ పిల్లలకు పుట్టి ఒక్కరే బతికారు అప్పుడు అర్థమైంది మొత్తం ఆరు రాళ్లు తీసుకొస్తే ( 4 ఆడ 2 మగ పిల్ల లు పుట్టి ) ఒక రాయి విసిరేయగా 4 ఆడపిల్లలు ఒక మగ సంతానం మొత్తం 5కి సరిపోయింది . విసిరేసిన రెండవ రాయికి - ఒక మగ సంతానం దక్కలేదు, అతను ఐదు సంవత్సరాల 23 రోజులు బతికి చనిపోయాడు. మనకు అర్థం కాక పోయినా స్వామి వారి లెక్క తప్పదు.

*బోన్ టి బి :*

నాకు10 సంవత్సరాలు ఉండేటప్పుడు 'బోన్ టి. బి.' వచ్చింది ఎముకల్లో గుజ్జు పోయింది, బలం లేదు. డాక్టర్లు మూడు సంవత్సరాలు మందులు వాడితే తగ్గవచ్చు అని చెప్పారు. ఒక సంవత్సరం తర్వాత, నేను గొర్రెలు తోలడానికి

వెళ్లేటప్పుడు చెట్టు ఎక్కి, అక్కడి నుంచి జారి కిందపడి, చెయ్యి విరిగిపోయింది. అమ్మ వాళ్ళు తిడతారని భయపడి చెప్పలేదు , కానీ ఊళ్లో తెలిసిన 'ఆర్. ఎం. పి.' డాక్టరు దగ్గర కు వెళ్లి, ఇంజక్షన్ చేయించుకున్నాను . నొప్పి అయితే తగ్గింది గాని ఒక నెల తర్వాత చెయ్యి బాగా ఎండిపోయింది , చెయ్యి పైకి లేప లేకపోయే దానిని. అదే సమయం లో మా తమ్ముడు చనిపోయాడు .

బాధలో ఉన్నారు కాబట్టి అమ్మ, నాన్న నా పరిస్థితి గమనించలేదు . చెయ్యి బాగా సన్నంగా అయిపోయేటప్పటికి వాళ్లు భయపడి హాస్పిటల్ కి తీసుకువెళ్లారు . అంతవరకు నెల రోజుల పాటు చెయ్యి అలాగే ఉంది కాబట్టి చెయ్యి కుళ్ళిపోయి చీము పట్టేసింది .డాక్టర్ గారు చెన్నై తీసుకెళ్లి చెయ్యి పూర్తిగా గా తీసేయాలని చెప్పారు. మా అమ్మ డాక్టర్ కాళ్లు పట్టుకొని "ఆడపిల్ల! ఎలాగైనా ఆపరేషన్ లేకుండా చేయమ"ని ఏడ్చింది. మేమేం చేయలేమమ్మా! లోపల అంతా పాడై పోయింది. ఒక పది రోజులు మందులు వాడి చూద్దాం అన్నారు. మా అమ్మ నన్ను వెంకయ్య స్వామి గుడి కి తీసుకుని వెళ్ళింది, ఒక చేత్తోనే దండం పెట్టాను. స్వామివారికి ఎలాగైనా నా చేయి తీయకుండా రక్షించమని మా అమ్మ ప్రార్థించింది . అలా నాలుగు వారాలు వెళ్ళాం . విచిత్రంగా నా చేయి పూర్తిగా నయమైపోయింది. ఎటువంటి ఆపరేషన్ గాని , చేయి తీసివేయటం కానీ జరగలేదు. కానీ చేయి కొంచెం సన్నగా అయింది. నా చెయ్యి పోకుండా కాపాడి జీవితాంతం స్వామి మీద విశ్వాసాన్ని కలిగించారు.

*బ్లడ్ కేన్సర్ నుంచి కాపాడటం :*

నాకు పెళ్ళయిన తర్వాత బాబు పుట్టిన నాలుగేళ్లకు, నా నోట్లో నుంచి ఎక్కువ రక్తం వాంతి లాగా పడింది. మా ఆయన భయపడి హాస్పిటల్ కి తీసుకెళ్లారు. మందులు ఏమీ ఇవ్వకుండా 'ఈమెకు బ్లడ్ క్యాన్సరు, ఇక్కడ లాభం లేదు- తిరుపతికి గాని, మద్రాసు గాని తీసుకుపొండి' అన్నారు అప్పట్లో మేము నెల్లూరు నుంచి బయటకు వెళ్లి డాక్టర్ కు చూపించడం అంటే ఇక బ్రతికే అవకాశం లేదు అనుకునే వాళ్ళు. మా ఆయన *"నేను తిరుపతికి తీసుకువెళ్ళను, వెంకయ్య స్వామి దగ్గరకి తీసుకెళ్తాను, ఆయన బతికించినా - చంపేసినా వెంకయ్యస్వామి ఇష్టం!"* అన్నారు. మమ్మల్ని అందరినీ ఇంటికి పంపించే సి తను ఒక్కడే వెంకయ్య స్వామి ( గుడి ) దగ్గరికి వెళ్ళాడు. ఇంతవరకు ఎప్పుడు నేను దేవుణ్ణి నమ్మలేదు, ఏ గుడికి వెళ్ళింది లేదు. *నువ్వు ఆమెను బతికిస్తే , ప్రతి సంవత్సరం నీ దగ్గరి కి వస్తాను, నీ దీక్ష తీసుకుని మాల వేసుకుంటాను. చనిపోతే శవాన్ని నీ దగ్గర కే తీసుకు వచ్చి ఇక్కడే వదిలి పెట్టి పోతాను .* అని చెప్పి ఏడ్చుకుంటూ అరచేతిలో నే హారతి వెలిగించి హారతి ఇచ్చాడు

( ఈయన కి మీకు చేయి కాల లేదా ? అని అడిగాను. నా గుండె మండిపోతుంటే చేయి కాలడం నాకు తెలియనేలేదు అని చెప్పారు – రచయిత )

తర్వాత వెంకయ్య స్వామి వారు మా నాన్న రూపంలో నా కలలోకి వచ్చి ,నన్ను ఆస్పత్రికి తీసుకెళ్లి ఆపరేషన్ చేయించారు. <u>తరువాత రోజునుంచి ఈ</u>

నాటికీ ఒక్క చుక్క రక్తం కూడా నోటిలో నుంచి పడలేదు. అంత భయంకరమైన బ్లడ్ - కేన్సర్ ఎలా వచ్చిందో ఎలా పోయిందో - అంతా విచిత్రం . ఈనాడు నేను భూమి మీద ఉన్నానంటే వెంకయ్య స్వామి వారే కారణం. ఆ నాటి నుంచి అంటే 20 సంవత్సరాల నుంచి మా వారు ప్రతి సంవత్సరం వెంకయ్యస్వామి మాల వేసుకుంటూ ఉన్నారు. కుటుంబ సమేతంగా ఆరాధన ఉత్సవాలకు పెన్నా నది నుంచి నడిచి వస్తున్నాము.

ఇప్పుడు మా పొలం నుంచి రెండు బళ్లు కట్టలు తీసుకొని వెంకయ్యస్వామి వారికి ఆరాధన కోసం అయ్యే వంటకి ఇవ్వడానికి వస్తాం. నిజానికి అక్కడ నుంచి తీసుకురావడానికి అయ్యే ఖర్చు కంటే, నెల్లూరులోనే కొని ఇవ్వటం చాలా చవక .కానీ మా పొలంలో నుంచి ఇవ్వాలని మా కోరిక.

మా ఊపిరి ఉన్నంత వరకు ఆయనతో నే మాకు అనుబంధం మేము ఏది గట్టిగా అనుకున్న మాకు అది కచ్చితంగా చేసి చూపిస్తున్నాడు ప్రస్తుతం మేము తిరుపతిలో ఉన్నా సరే పైనుండే తిరుమల కంటే కూడా వెంకయ్య స్వామి దగ్గరికి ఎక్కువగా వస్తాం. మా కొడుకు బెంగళూరులో రెండు పీజీ (పేయింగ్-గెస్ట్ హౌస్ )ల లో భాగస్వామ్యం తీసుకున్నాడు. మూడో పీజీలో కూడా పార్టనర్ షిప్ దొరకాలని కోరుకున్నాడు. అందుకు మళ్లీ వెంకయ్య స్వామి వారి దగ్గరకు వెళ్లాను అది కూడా దొరికింది.

*లాభాల వ్యవసాయం :*

మాకు పంట పండించేటప్పుడు మొదలుపెట్టిన సంవత్సరం దగ్గర నుంచి ఈ సంవత్సరం వరకు 20 సంవత్సరాల్లో ఎప్పుడూ ఏ పంట పెట్టినా కూడా నష్టం అనేది లేదు . గత సంవత్సరం మా పంటలో 25 క్వింటాళ్లు శనగలు పండుతాయి అంతకుమించి ఒకటి కూడా ఎక్కువ రాదు అని అందరూ చెప్పారు. మా ఊర్లో చాలామందికి ఎకరా పొలానికి ఒక క్వింటా లేదా 50 కేజీలు మాత్రం పండేవి . నేను మా ఇంటి లోనే వెంకయ్య స్వామికి ఇలా మొక్కుకున్నాను స్వామి మాకు 30 క్వింటాలు పండితే ఒక క్వింటా పంట మీకు సమర్పించుకుంటాను అని మావారికి పంట కొలిచేటప్పుడు ముందుగానే వెంకయ్య స్వామికి ఒక ఒక క్వింటా శనగలు తూనిక వేసి పక్కన పెట్టమని చెప్పాను. తర్వాత మిగతావి కొలిస్తే అవి 32 క్వింటాలు వచ్చాయి స్వామివారి దయవల్ల పంట అద్భుతంగా పండింది ఊర్లో అందరూ వెంకయ్య స్వామి మీకు ఇంత పంట ఇచ్చారు అని అన్నారు .

మేము ఊర్లో లేమంటే వెంకయ్య స్వామి దగ్గరే వెళ్లి ఉంటారని మావూర్లో అందరూ అంటుంటారు. మా ఊర్లో మాకు వెంకయ్య స్వామి కృప ఎక్కువగా ఉంటుందని ఫేమస్ అయిపోయాం . వెంకయ్య స్వామి అంటే మాకు పిచ్చి మేము తిరుపతి వెళ్ళినా గాని గోవిందా అనకుండా నారాయణ అంటాం శివాలయం కి వెళితే ఓం నమశివాయ అనకుండా అక్కడ కూడా నారాయణ అంటాం. అంతలా అలవాటైపోయింది .

ఈ సంవత్సరం 2024 జనవరి 22 న రాములు వారి ప్రాణ ప్రతిష్ట అయోధ్యలో జరిగింది అదే రోజు మా అమ్మ కాలం చేసింది మా అమ్మకు అంతగా బాగోలేదని మా ఇంట్లో నాకు చెప్పలేదు వెంకయ్య స్వామి వారి కృప కోసం21వ తారీఖున ఆయన ప్రసాదంవిభూతి తీర్థం, దారం తెప్పించి ఆమెకి ఇచ్చాము. అది తిని మరుసటి రోజుఆమె కాలం చేసింది. ఆమె బతికున్నంత వరకు వెంకయ్య స్వామి వారి భక్తురాలు చిన్నప్పుడు స్వామివారిని దర్శించేది కూడా. ఆమెకి ఆరోగ్యం బాగోలేనప్పుడు ఓం నారాయణ ఆదినారాయణ అని జపిస్తూ ఉండేది. ఆమె నాతో ఎప్పుడూ "నీకు స్వామే అన్నీ చూసుకుంటాడు" అని చెప్పేది. ఆమెను స్మశానానికి తీసుకెళ్తుంటే చాలా ఎక్కువ తెల్లావులు ఎదురొచ్చాయి. ఒక పది నిమిషాల పాటు అక్కడే ఆగి ఉండిపోయాయి మమ్మల్ని ముందుకు వెళ్లడానికి దారి ఇవ్వలేదు. అసలు మా ఊర్లో ఒకటో రెండో మాత్రమే ఆవులున్నాయి. ఆ విషయం మాకు కచ్చితంగా తెలుసు అన్ని తెల్ల ఆవులు ఎక్కడ నుంచి వచ్చాయో తెలియదు. మాకు అది ఎంతో మంచి శకునంగా అనిపించింది. ఆమె ఉత్తమ లోకాలకు వెళ్తుందని మా విశ్వాసం. మా అమ్మ విస్తరాకుల చెట్లు ఎక్కేటప్పుడు వెంకయ్య స్వామి వారు అగ్నిగుండం వేసుకొని అక్కడే ఉండే వారంట. మా అమ్మ చెట్టు ఎక్కేటప్పుడు 'జాగ్రత్త అమ్మ!' అని వెంకయ్య స్వామి చెప్పేవారట! ఆయన ఆ విస్తరాకులు చెట్టు కిందనే కూర్చొనే వారంట. నాకు వెంకయ్యస్వామి వారి మీద భక్తి మా అమ్మ నాన్న నుంచే వచ్చింది.

కర్ణం సుజాత గారి భర్త కర్ణం సుబ్బరాయుడు గారు - వారి అనుభవాలు ఇలా చెపుతున్నారు :

నేను ఉండేది కలువాయి మండలం చౌటపల్లి, పొదలకూరు దగ్గర, నెల్లూరు జిల్లా .నేను మొదట్లో మొరటోడుని, మూర్ఖుడిని. ఎప్పుడు దేవుడికి రెండు చేతులతో దండం పెట్టి ఎరగని వాడిని. ఎప్పుడైనా ఎవరైనా నన్ను అడిగినా కూడా 'దేవుడు ఎక్కడున్నాడు?' అని సమాధానం చెప్పేవాడిని. నా భార్యకు ఆరోగ్యం బాలేనప్పటి నుంచి వెంకయ్య స్వామివారిని ఆశ్రయించాను. అప్పటికి నా దగ్గర ఉండటానికి ఇల్లు లేదు, పొలం లేదు, డబ్బు లేదు . నేను మూర్ఖుడిని కాబట్టి నాకు మా అత్తగారి నుంచి గాని, నాన్నగారి నుంచి గాని ఎటువంటి ఆదరణ లభించేది కాదు. నాకు ఏ ఆధారం లేదు. ఎవరో ఒక ధర్మాత్ముడు కొంత డబ్బులు ఇస్తే వాటితో గొర్రెలుకొని మేపుకుంటూ ఉండేవాడిని.నా కూతురు రెండు సంవత్సరాల బిడ్డ. అలాంటి పరిస్థితులలో మా భార్యకు ప్రాణాంతకమైన బ్లడ్ క్యాన్సర్ జబ్బు వచ్చింది. డాక్టర్లు ఒకటో రెండో రోజులు బతుకుతుంది అని చెప్పే పంపించేశారు. నా భార్య ప్రాణం కాపాడి నన్ను స్వామి తన వాడిని చేసుకున్నారు. అప్పటినుంచి వెంకయ్య స్వామే నా దేవుడు.

*గొర్రెల కాపరి :*

నాకు ఉన్న గొర్రెల లో ఒక గొర్రె తప్పిపోయింది. నేను 12 రోజుల పాటు చూసుకోలేదు. వెంకయ్య స్వామివారు మా ఊళ్లో ఉండే వెంకటసుబ్బయ్య లా

ఉండేవారట .కలల్లో నాకెప్పుడూ ఆయన రూపంలోనే కనిపిస్తుంటారు. అయ్యా చూటి గొర్రె ( కడుపుతో ఉన్న గొర్రె) లేదు, చూసుకున్నావా? అన్నారు. ఆ విషయం నాకు తెలియదు. మెలకువ వచ్చింది కానీ నేను లేవకుండా మళ్లీ పడుకున్నాను, కానీ స్వామివారు నన్ను తట్టి మరీ లేపారు. నేను ఉలిక్కిపడి లేచి గొర్రెలను వెతికితే అది కనిపించలేదు. తర్వాత నేను ఊరంతా వెతికితే కూడా కనిపించలేదు . తర్వాత కొంతమంది గొర్రెలు తోలుకుంటూ ఉంటే వాటి మధ్యలో చూసాను , నా గొర్రె కనిపించింది. వారితో నేను " ఈ గొర్రె మీద కాదు కదా ! ఎందుకు చెప్పలేదు?" అంటే ఈ గొర్రె వచ్చి 12 రోజులైంది. మీదని తెలీదు కదా! ఈరోజు వరకు చూసి రేపు కసాయి వారికి అమ్మి ఎంతో కొంత డబ్బు చేసుకుందా మని అనుకుంటున్నాము. అని నా గొర్రె ను నాకు ఇచ్చేశారు. అంటే వెంకయ్య స్వామివారు నేను వెతుకుతానే మో అని ఇంత వరకు చూసి, వీళ్లకి ఈ ఆలోచన కలిగినప్పుడు నన్ను నిద్ర లేపారన్న మాట. – (వీరి అమాయకపు మొండి భక్తికి వెంకయ్య స్వామివారు ఇతని గొర్రెలకు కూడా కాపలా ఉన్నారన్న మాట )

*పొంగలి( ప్రసాదం) – మందు :*

మా గొర్రెలకు ఎప్పుడైనా ఆరోగ్యం బాగులేక పోతే నేను ఏ మందు కూడా ఇవ్వను. వెంకయ్యస్వామి వారి విభూతి మాత్రమే ఇస్తాను. ఒక సారి మా ఊర్లో బొబ్బలు రోగం ( అమ్మవారు ) వచ్చి గొర్రెలు గుంపులుగా చనిపోతున్నాయి. నాకున్న సుమారు 80 గొర్రెలలో కొన్నింటికి అమ్మవారు వచ్చింది. వాటి ఒంటి చర్మానికి గుల్లలు వస్తే చనిపోయిన తర్వాత ఆ చర్మం కూడా ఎందుకూ పనికిరాదు. నా కున్న ఏకైక బతుకు తెరువు ఆ గొర్రెలే ఇంకేమీ ఆస్తి లేదు. నా పరిస్థితి అయోమయంగా ఉంది -వాటి వల్లే మేం బతుకుతున్నాం. స్వామినే నమ్ముకుని వున్నాను . వెంకయ్య స్వామివారు కలలోకి వచ్చి నీవి రెండు గొర్రెలు చనిపోతాయి మిగితా వి బతుకుతాయి అని చెప్పారు . అందువల్ల నేను ఎవరు ఎంత చెప్పినా స్వామిని నమ్ముకుని ధైర్యంగా ఉన్నాను మిగతా వారు మా గొర్రెలు నుంచి వ్యాధి వారి గొర్రెలు కు వస్తుందని భయపడ్డారు. కానీ నా నమ్మకం నాది. కొంతమంది కి 50 – 60 ఉంటే మందులు వాడినా ప్రయోజనం లేకపోయింది . ఒక అతనికి మొత్తం అతనికున్న 50 గొర్రెలూ చనిపోయాయి. కానీ నాకు మాత్రం స్వామి వారు చెప్పినట్టు కేవలం రెండు గొర్రెలు మాత్రమే చనిపోయాయి.

వెంకయ్య స్వామి వారు కాపాడకపోతే మొత్తం చనిపోయేవి నేను చేసిన పని వెంకయ్య స్వామి వారి మందిరానికి వెళ్లి నాలుగు కప్పుల పొంగలి ప్రసాదాలు తీసుకొని, వాటిలో విభూతి కలిపి గొర్రెలకు తినిపించాను తెల్లవారే సరికి వాటికి నయం అయిపోయింది.

నాకు ఇల్లు గాని , పొలం గాని ఏమీ లేవు. కానీ గవర్నమెంట్ స్థలంలోనే నేను కట్టుకున్న ఇంటికి పట్టా వచ్చింది . దానిని మిగతా వారు కుట్రతో తమది చేసుకొందామని ప్రయత్నించారు, కానీ ఎవరికి సాధ్యపడలేదు స్వామివారి ఆపన్న హస్తం మా మీద ఉంది కాబట్టి. ఈరోజు వరకు కూడా మా స్థలం జోలికి

ఎవరూ రాలేదు మా పంట పొలానికి మనుషులు కాదు కదా పందులు కూడా రావు . అది ఒక విచిత్రమైన విషయం . మా చుట్టుపక్కల వాళ్ళు వారి పొలంలో పందుల నుంచి కాపలా కోసం మంచం వేసుకొని పడుకుంటే మంచం కిందికి కూడా వచ్చి తిని పోతాయి , కానీ మా పొలంలో మాత్రం ఇప్పటికీ ఏ పందులు రావు . నేను మా పొలానికి కాపలాగా కనీసం ముళ్ళకంపలు కూడా అడ్డముగా పెట్టను. అవి మా పొలం గట్టు మీద నుంచే వెళ్తాయి కాని లోపలికి మాత్రం రావు. నా పొలంలో ఏ పంట పండినా మొదటి బస్తా వెంకయ్యస్వామి వారి కోసం పక్కన పెట్టి, మిగతా పంట వాడు కుంటాను. ఇప్పుడు మా పంటను కౌలుకు ఇచ్చాం. కౌలు ద్వారా వచ్చిన ఏపంటయినా మొత్తం స్వామివారికి ఇచ్చేస్తాం మేము వాడుకోము.

కౌలు తీసుకున్నవారు మాకు ఏది ఇస్తే అదే తీసుకుంటాం అంతేగాని నాకు ఇంత కావాలని నేను అడగను ( వారు ఇంత ధర్మాత్ముడు కాబట్టే వెంకయ్య స్వామి వారు అంత రక్షణ ఇస్తున్నారు - రచయిత )

మా ప్రతి పనిలోనూ వెంకయ్య స్వామి వారే మా మొదటి ప్రాధాన్యత. బర్రె సంతానం కనేటప్పుడు ఆ పాలు చిలికి వెన్న, నెయ్యి తయారు చేసి మొదటి కిలో నెయ్యి స్వామి వారికి ఇస్తాం.

మా ఇంటికి వాకిలి కూడా ఉండేది కాదు ఒక పెద్ద గుంజతో తయారుచేసిన పై కప్పు ఉండేది అలాంటి పరిస్థితుల్లో ఒకసారి పెద్ద గాలి వాన వచ్చి మొత్తం అంతా విరిగి తల్లి, పిల్లల పై పడిపోయింది . అంత పెద్ద బరువు పడినా నా భార్యకు గాని, పిల్లలకు గాని ఏ ప్రమాదం జరగలేదు. నేను రెండు రోజుల తర్వాత ఇంటికివచ్చి మళ్లీ ఇల్లు తయారు చేసుకోవాల్సివచ్చింది. మాఇంటిలో ఎప్పటికప్పుడు పెద్ద పెద్ద చెదపుట్టలు రాత్రికి రాత్రే తయారైపోయినవి ఉండటానికి చాలా ఇబ్బందిగా ఉండేది. దేవుడు ఫోటోలు పక్కనే ఉండేవి. ఎన్ని సార్లు తీసి నా మళ్ళీ వచ్చేసేవి .

ఒకసారి విసిగిపోయి మరి తీయలేక దేవుడికి మొక్కుకున్నాను .ఈసారి గనుక ఈపుట్ట పెరగకుండా ఇలాగే ఆగిపోతే ఇది(పుట్ట) పూజించుకోవడానికి బాగుంది కాబట్టి ఇంక నేను తీయను అని మొక్కుకున్నాను ఇంకా మరి ఆ పుట్ట పెరగలేదు తరగలేదు అలాగే ఉండిపోయింది. అలా పది సంవత్సరాలు అలాగే ఉంది ( మేమున్నంతవరకు.). నాకు గాని, మా పిల్లలకు గాని తేలు కూడ కుట్టలేదు ఎందుకంటే చుట్టుపక్కల అంతా పంట పొలాలు, మా ఇంటికి వాకిలి కూడా లేదు. ఆ తర్వాత పది సంవత్సరాలకి మేము ఊరులో ఒక స్థలం కొని ఇల్లు కట్టించుకున్నాం.

ఇప్పుడు నేను వరంగల్ దగ్గర భూపాలపల్లి దగ్గర ఉన్నాను వెంకయ్య స్వామి మాల వేసుకుంటాను. ముక్కోటి ఏకాదశి నాటికి వెంకయ్య స్వామి దీక్ష ముగిస్తాను.

*స్వామివారే ముందు తరువాతే నాపని:*

ప్రతి సంవత్సరం కొద్ది రోజులపాటు మాల వేసుకుని గొలగమూడి లోనే ఉండి, వస్తూ ఉంటాను . ఇంటిదగ్గర వ్యవసాయం చేస్తూ ఉండేటప్పుడు మొదటి తొమ్మిది సంవత్సరాలు మండలం రోజులు వెంకయ్య స్వామి వారి దగ్గరే ఉండి దీక్ష చేసేవాడిని .వ్యవసాయానికి నేను ఉండటం ఎంత అవసరం ఉన్నా గాని వెంకయ్య స్వామే ముందు తర్వాతే నా పని.

నేను మాల వేసుకుంటే నేను ఒక్కడినే కాకుండా మా ఇంట్లో అందరం కూడా పూజ ,భజన చేస్తాం. మా ఇల్లే ఒక దేవాలయం. నాకైతే ఇంట్లో ఉన్నా , గుడిలో ఉన్నా ఒకేలా అనిపిస్తుంది. నాకు ఏ అలవాటు ఉన్నా సరే, మాల వేసేటప్పుడు దీక్షలో ఏ పొరపాటు కూడా చేయను. నాకు అలవాటుగా ఉన్న బీడీ సిగరెట్ కూడా ముట్టుకోను అంగట్లో టీ కూడా తాగను. చాలా నిష్టగా ఉంటాను.

2010 లో మా కుటుంబం చవటపాలెం నుంచి తిరుపతికి వెళ్లిపోయి అక్కడే స్థిరపడిపోయాం.ఇప్పుడు నేను లిక్కర్ గోడౌన్ లో కాంట్రాక్ట్ పని తీసుకున్నాను. ఈ మధ్యనే లాభానికి అమ్మేశాను. నా మొండితనం వల్ల నేను చాలా నష్టపోయాను ఎవరి మాట వినను అందుకే వెంటనే స్వామి వారు నాకు ఇష్టమైన మా భార్యకు ఇబ్బంది పెట్టి నన్ను తన వద్దకు లాక్కున్నారని పిస్తుంది నాలో ఉన్న నిజాయితీయే స్వామి నన్ను రక్షించడానికి కారణమని నమ్ముతాను. నా పిల్లలు కూడా అంతే ఎవరి దగ్గర ఒక రూపాయి కూడా ఆశించరు. స్వామి వారి కృప మాత్రమే నన్ను ఏమీ లేని పరిస్థితి నుండి పది ఎకరాల పొలం పశుసంపదను ఇచ్చింది, నా కూతురు ఇంజనీరింగ్ చదవడం, నా కొడుకు బెంగళూరులో స్థిరపడటం జరిగింది.

నా కొడుకు కోసం అవసరం అయి తన వ్యాపారానికి 10 లక్షలు కావాలంటే ఇప్పటికిప్పుడు నాకు ఎలా దొరుకుతాయని అనుకున్నాను, కానీ వెంకయ్య స్వామి అప్పు దొరికేలా చేశారు ఇది కచ్చితంగా నా బలం కాదు అనుకుంటాను. నాకు ఈ మధ్య నా రెండు మోకాళ్లు కి ఆపరేషన్ జరిగింది ఎలా జరుగుతుందో అని భయపడుతూ మా ఇంట్లో అందరూ ఇంట్లో పూజ చేసుకుంటున్నారు. ఆపరేషన్ జరుగుతుండగా ఎవరో ఒక నర్స్ నా దగ్గరికి వచ్చి, అయ్యా నేను వచ్చాను భయపడకు లేయ్యా ! ఆపరేషన్ చక్కగా జరుగుతుంది అని చెప్పింది. ఆ మాట తీరు నాకు వెంకయ్య స్వామి వారు చెప్పినట్లుగా అనిపించింది.

ఒక గ్రూపు వారు నన్ను అడ్డం పెట్టుకొని వారి పని చేసుకోవడానికి వేరే గ్రూపు వారి మీద కక్షతో మా ఫ్రెండ్ మీద కంప్లైంట్ పెట్టారు. కానీ ఆవిషయం లో పోలీస్ వారు నన్ను అనుమానించి పోలీస్ స్టేషన్ కి రప్పించుకున్నారు. అనుమానంతో నన్ను రెండుసార్లు కొట్టారు ఒకసారి కొట్టినప్పుడు ఓం నారాయణ అని, రెండోసారి కొట్టేటప్పుడు ఆదినారాయణ అని అరిచాను మూడోసారి కొట్టడానికి ఎస్సై కర్ర పైకి ఎత్తాడు వెంటనే లోపల నుంచి సిఐ “

ఆపరా జేమ్స్" అని అరిచాడు. ఇతని కర్రపైనే ఆగిపోయింది. అతని విషయం రేపు ఆలోచిద్దాంలే అని చెప్పాడు.

నా అనుభవంలో నాకు, నేను ఎంత భయపడితే అంతగా స్వామివారి రక్షణ నాకు కనిపించేది. మా ఫ్యామిలీలలో అందరికీ పోలీసులంటే ఎంతో భయం కానీ ఇప్పుడు ఈ పరిస్థితి వచ్చింది. అందుకే నా భార్య ఇంట్లో పూజలు చేసి నా దగ్గరకు వచ్చింది అప్పుడు నేను పోలీస్ స్టేషన్లో నిద్రపోతున్నాను నాకు అసలు భయమే అనిపించలేదు. నా మనసులో నేను వెంకయ్య స్వామి వారి ఆశ్రమంలో పడుకున్నాను అని అనుకున్నాను. తర్వాత వాళ్లే నన్ను పెళ్లి కొడుకు లాగా వారి జీపులో నుంచి మా ఇంటికి గౌరవంగా తీసుకువెళ్లి దించారు. నాకు పోలీస్ స్టేషన్లో టిఫిన్ కూడా పెట్టారు. వారు 40 రోజుల్లో స్టేషన్ లోనే ఉంచినా సరే ,నన్ను ఖైదీగా చూడలేదు సెల్ లో పెట్టలేదు .

*స్వామి ఉన్నాడు - వారికి చెప్పుకో :*

నాకు ఇప్పటికీ కూడా ఏది అత్యవసరమని అనిపిస్తే అది ఎలాగో లాగా జరుగుతుంది మా పిల్లలు కూడా పరీక్ష పేపర్ మీద ఓం నారాయణ ఆదినారాయణ అని రాసే పరీక్ష రాయడం మొదలు పెడతారు.నాకై నేను ప్రయత్నం చేసేది ఉండదు అన్నీ ఆయనే నాకు చూస్తున్నారు. నాకు కాలు ఆపరేషన్ జరిగి, నేను కష్టమైన పని చేయలేని పరిస్థితుల్లో, నాకు వేరే జాబ్ కావాలని అనిపించింది. ఇంకొక రెండు నెలల్లో నేను పనిచేయగలుగుతాను అన్న ప్పుడు ఒక మిత్రుడు ఫోన్ చేసి నీకు పని ఉందని చెప్పి ఆ పని ఇప్పించాడు. ఇప్పుడు మా పశువులన్నీ అమ్మేశాం. ఏమీ లేని పరిస్థితి లో ఉండే మాకు ఇప్పుడు ఆరు ఎకరాల పొలం, ఒక ఇల్లు ఉన్నాయి.

మొండి మనిషిగా ఉండే నన్ను మార్చింది వెంకయ్య స్వామి వారు. నన్ను నిజాయితీగా ఉండే మంచి మనిషిగా చేయమని స్వామివారిని ప్రార్థిస్తూ ఉంటాను. నన్ను మార్చడం మా అమ్మ వాళ్ళ గాని మా అక్క వల్ల గాని మా మామ వల్ల గాని వీలుకాలేదు స్వామివారే మార్చారు. మోకాలు సర్జరీ అయిన తర్వాత నేను పెన్నా నదిలో మునిగి ఇరుముడి కట్టించుకుని అక్కడి నుంచి 30 కిలోమీటర్ల నడిచి వెంకయ్య స్వామి వారి దగ్గరికి వెళ్లాను. నాతోపాటు మా భార్య పిల్లలు కూడా నడిచే వచ్చారు. మా వాళ్ళందరూ లారీలోనైనా బస్సులోనైనా వారితో పాటు రమ్మని చెప్పినా గాని నేను నడచుకునే వెళ్ళాను. ఏ పరిస్థితుల్లోనైనా నా ఆధారం 'స్వామి' - మనుషులు కారు. నేను వెంకయ్య స్వామి వారి గురించి నిప్పుల్లోనైనా దూకుతాను. 'ఆయన ఉన్నాడు అనుకుని నిప్పుల్లో దూకినా' మనకి ఏమీ అవదు.

కరోనా వచ్చినప్పుడు నేను నా కుటుంబాన్ని, మన దేశాన్ని, ఈ కరోనా నుంచి కాపాడమని ప్రార్థించాను. నా కొడుక్కి నా కూతురికి ఉద్యోగాలు నేను అడగలేదు వాటి సంగతి ఆయనే చూసుకుంటారు కదా!

మా బంధువుల అమ్మాయికి పిల్లలు పుట్టలేదు. వారు చాలా హాస్పిటల్ ల కి , పెంచలకోన గుడి, ఇంకా  చాలా గుళ్ళు తిరిగారు. కానీ ఏం ప్రయోజనం కనిపించలేదు. చాలా బాధపడుతూ ఉన్నారు .ఇక మరి ఆమెకు పిల్లలు పుట్టరు అనుకున్నారు. వారికి వెంకయ్య స్వామి వారి గురించి చెప్పి, స్వామివారి దగ్గరికి తీసుకు వెళ్లాను, ఆమెను తీసుకువెళ్లి స్వామి వారికి చెప్పుకో! నీకు కచ్చితంగా పిల్లలు పుడతారని చెప్పాను. వచ్చిన మూడు నెలల్లోనే ఫలితం కనిపించి , మూడు సంవత్సరాల్లో ఇద్దరు మగ  పిల్లలు పుట్టారు.

నా దగ్గరకు ఎవరైనా  ఏదైనా సమస్యతో వస్తే, నేను వారిని  వెంకయ్య స్వామి వారి దగ్గరికి తీసుకెళ్ళిపోతాను .

కరణం సుజాత గారి కుమార్తె కుమారి లేఖన ఇలా చెపుతుంది :

మా కాలేజ్  'కాళహస్తి రోడ్' లో ఉండేది .నేను ఇంటికి రావాలంటే 5 కిలోమీటర్ల ముందు కాలేజీ బస్సు ఆపేసేవారు, అక్కడ నుండి నేను ఆటోలో నుంచి గాని నడిచి గాని వెళ్ళాలి. ఆటో కి 20 రూపాయలు అవుతుంది ,కానీ ఒకరోజు నేను డబ్బులు తెచ్చుకోవడం మర్చిపోయాను సాయంత్రం ఐదు గంటలు అయింది, చిన్న చినుకులు పడుతున్నాయి నేను నెమ్మదిగా నడవడం మొదలుపెట్టాను సూర్యుడు తొందరగా వెళ్ళిపోతున్నాడు, సూర్యుడా నువ్వు వెళ్లిపోయే లోపల నేను ఇంటికి చేరిపోవాలి వెంకయ్యస్వామి నువ్వే చూసుకోవాలి అని మనసులో అనుకుంటున్నాను. నేను లిఫ్ట్ అడుగుతున్నాను కానీ ఎవరు ఆపటం లేదు. ఒకాయన వెళ్తూ తన బండి ఆపి నువ్వు నాయుడు కూతురు కదా అన్నాడు నేను అవును అని చెప్పాను ఎందుకు నడుచుకొని వెళ్తున్నావ్ అని అడిగారు మీ నాన్న నాకు తెలుసులే  ఎక్కు అన్నాడు. అతను మా నాన్న పనిచేసే  గోడౌన్ లోనే అతను కూడా పనిచేస్తున్నాడు అనుకున్నాను ఎందుకంటే ఆ గోడౌన్ లోనే మా నాన్నను నాయుడు అని పిలుస్తారు ఇంక ఎక్కడా అలా పిలవరు . ఇల్లు ఇంకా 500 మీటర్స్ దూరం ఉందనగా నేను ఆపమని చెప్పి ఇక్కడి నుంచి వెళ్ళిపోతాను లే పరవాలేదు అన్నాను ఆయన నన్ను దింపే సి మళ్ళీ వెనక్కి వెళ్ళిపోయారు. నాకు ఆశ్చర్యం వేసింది తర్వాత మా నాన్నకి చెప్తే ఈ దగ్గరలో నాకు ఎవరూ తెలిసిన వాళ్ళు లేరు ఆయన ఎవరో నాకు తెలియదు కనీసం నువ్వు పేరైనా కనుక్కోవాల్సింది అన్నారు. ఆయనెవరో ఇప్పటికీ తెలియ లేదు.( ఇంకెవరు వెంకయ్య స్వామి వారే... )

నా ఇంజనీరింగ్ 2022 లో కంప్లీట్ అయిపోయింది,తర్వాత ఒక సంవత్సరం బెంగళూరులో కోచింగ్ తీసుకున్నాను జాబ్ కోసం ప్రయత్నిస్తున్నాను మనసులో చెన్నైలో జాబ్ వస్తే వెంకయ్య స్వామి వారి దగ్గరికి వెళ్ళటానికి బాగుంటుంది అని కోరిక. కోయంబత్తూర్ లోఒక కంపెనీ నాకు ఆఫర్ లెటర్ కూడా పంపించి తర్వాత మరి కాల్ చేయలేదు. ఇంక మరి వారు పిలవడం లేదని ఇంటికి వచ్చేసాను.

ఫేక్ ఎక్స్పీరియన్స్ పెట్టి 2024 జనవరి లో ఒక కంపెనీకి  అప్లై చేస్తే అందులో

జాబ్ వచ్చింది. వాళ్ళు బ్యాక్ గ్రౌండ్ వెరిఫికేషన్ లో కనిపెట్టి జాబు పోయే ప్రమాదం ఉంది. వెంకయ్య స్వామి వారి దగ్గర చీటీలు పెట్టి వెళ్ళాలా వద్దా అని నిర్ణయించు కుంటే వెళ్ళమని వచ్చింది . గొలగమూడి వచ్చి నీదే భారం స్వామి అని స్వామి వారికి దండం పెట్టి పూనే వెళ్లాను. అనుకున్నట్టే ఆ జాబ్ పోయింది నేనేం బాధపడలేదు.

అక్కడ పీజీలో ఇంకా ఉండటానికి 15 రోజులు గడువుంది. అప్పుడే కోయంబత్తూరు కంపెనీ వారు కాల్ చేసి తక్కువ ప్యాకేజీ తో బాండ్ కూడా రాయించుకొని జాబ్ లో జాయిన్ అవ్వమని చెప్పారు . అది అస్సలు బాగాలేదు అందువల్ల మా అమ్మతో కాల్ చేసిమాట్లాడుతూ ఏడ్చి నేను ఇంటికి సపోర్ట్ చేయలేను నాకు మరి జాబు రాదు అని ఏడ్చాను. అదే రోజు వేరే కంపెనీ వాళ్లు ఇంటర్వ్యూ చేసారు. నేను మార్చి 31 వరకే ఉంటానని చెప్పాను , ఆ రోజునే అన్ని రౌండ్స్ కంప్లీట్ చేసి నన్ను సెలెక్ట్ చేసి ఆదివారం అయినా సరే ఆఫర్ లెటర్ రిలీజ్ చేసేసారు. ఏప్రిల్ 4 న నేను జాయిన్ అయ్యాను అయితే జాబ్ లొకేషన్ చెన్నై , నేను కోరుకున్న లొకేషన్ . ఆ విధంగా వెంకయ్య స్వామి వారు నా కోరిక ప్రకారం చెన్నైలో జాబ్ ఇప్పించారు .జాబ్ లో జాయిన్ అయిన తర్వాత ఆ వీకెండ్ వెంకయ్య స్వామి దగ్గరికి వెళ్లి కృతజ్ఞతలు చెప్పుకున్నాను. ప్రతీ నెలకు ఒకసారి చెన్నై నుంచి వెంకయ్య స్వామి వారికి వెళ్లాలని నా కోరిక.

నేను నా జాబ్ కోసం నాకు తెలిసిన వాళ్ళందరినీ అడుక్కున్నా కానీ చివరకు వెంకయ్య స్వామి వారే చేస్తారని అర్థమైంది

నా చిన్నప్పుడు వేసవి సెలవులు అయిన తర్వాత స్కూల్ లోకి వెళ్ళేటప్పుడు ప్రతి సంవత్సరం కూడా ముందు వెంకయ్య స్వామి దగ్గరికి వెళ్లి దర్శనం చేసుకుని ఆ తర్వాతే స్కూల్లో జాయిన్ చేసేవారు

మా ఇంటిలో ప్రతి పని మొదట వెంకయ్య స్వామి వాళ్ళ దగ్గరికి వెళ్లిన తర్వాతే మొదలవుతుంది . మేము బంగారం కొనేటప్పుడు కూడా వెంకయ్య స్వామి వారి దగ్గరికి వెళ్లి అక్కడ తాకించి వాడతాం. భోజనం చేసేటప్పుడు వెంకయ్య స్వామి వారి కోసం ఒక ముద్ద పక్కన పెట్టి తర్వాత భోజనం చేస్తాను. ప్రతి సంవత్సరం స్వామివారి ఆరాధనకి వెళుతూ ఉంటాం.

నేను తిరుపతి వెళ్ళినప్పుడు గోవిందా గోవిందా అని నా మనసులో నుంచి రావడం లేదు ఓం నారాయణ నారాయణ అని వెంకయ్య స్వామి పేరే వస్తుంది .నేను వెంకయ్య స్వామిని నారాయణ అంటాను. ఆయన మీద భక్తి ఉండేటట్టు మమ్మల్ని స్వామి అనుగ్రహించారు.

<u>ఓం నారాయణ - ఆది నారాయణ</u>

శ్రీ అశోక్ చక్రవర్తి – అనంతపురం :



అశోక్ చక్రవర్తి గారి తల్లిదండ్రులు వెంకయ్యస్వామి వారికి పరమ భక్తులు వీరు చాలా సార్లు వెంకయ్య స్వామి వారి మాల ధరించారు, మూడుసార్లు అనంతపురం నుండి గొలగమూడి కి పాదయాత్ర చేశారు.

2007-2008 మధ్యకాలంలో మాల ధరించి, గొలగమూడి సందర్శించి, నాలుగు నిమ్మకాయలు సమాధి మందిరానికి తాకించి, అగ్నిగుండంలో ఊది తీసుకొని వీరి భూమి ఉన్న ఊరు 'నల్లచెర్లపల్లి' గ్రామానికి వెళ్లి వాళ్ళ పొలంలో నాలుగు మూలల ఈ నిమ్మకాయల ను పాతిపెట్టి, తెచ్చిన ఊదిని పొలం అంతా చల్లి, శ్రీస్వామివారికి నమస్కరించుకున్నారు.

వీరికి "ప్రతిసారి 60 నుండి 70 క్వింటాళ్ల దాకా వేరుశనక్కాయ పండేది, ఈ విధంగా చేసిన తర్వాత రెట్టింపు కంటే ఎక్కువగా-150 మూటల దాకా వేరుశనక్కాయ పంట పండింది!!!" ఆ ఊర్లో వీరికి మాత్రమే ఇంతబాగా రెట్టింపు కంటే ఎక్కువగా పండింది. మిగిలిన వారందరికీ మామూలు పంటగానే పండింది. అద్భుతమైన సంఘటన ఈ పంటను చూడ్డానికి చుట్టుపక్కల పల్లె జనాలంతా వచ్చి చూశారు. వారందరికీ ఇలాగే చేయమని చెప్పారు.గొలగమూడి నుండి నిమ్మకాయలు, ఊది తెచ్చి ఈ పొలంలో వేసినందుకే ఇంతగా పంట పండిందని భగవాన్ శ్రీశ్రీశ్రీ వెంకయ్య స్వామి వారు మహిమాన్వితులని చెప్పగా ఆ ప్రాంతపు ప్రజలందరూ ఆశ్చర్యపోయారు .

వేరుశనక్కాయ పండిన తర్వాత చెట్లని పెరికి మొదళ్లను పొలంలోనే ఉంచారు. అవన్నీ బండ్లకెత్తి పంపించే లోగా ఒక గొర్రెల మంద వచ్చి, వీరి పొలంలో పడి వేరు శనక్కాయలను తినేస్తున్నాయి, వాటిని బయటకు తోలమని ఎంతగా చెప్పినా వారు నిర్లక్ష్యంగా వ్యవహరించారు. దాదాపు 2000 రూపాయల పంట గొర్రెలు మొత్తం తినేసాయి. మేము ఎంత చెప్పినా వినకపోయేసరికి మా నాన్న ఒక పొట్టేలు పట్టుకున్నాడు. 'మాకు నష్టం జరిగింది ఎవరికి చెప్పుకుంటావో చెప్పుకో! ఈపొట్టేలును ఇవ్వన'న్నారు. వెంటనే ఆ గొర్రెల యజమాని వాటిని పొలం నుండి బయటకు తోలేశాడు. నా పొట్టేలు నాకు ఇవ్వమని చాలా ప్రాధేయపడ్డాడు. వీరు ఇవ్వలేదు. చివరికి పొరపాటయింది అని చెప్పిచెంపలు వేసుకున్నారు.

అప్పుడు మా నాన్నగారు అన్నారు "మా స్వామి సత్యమైన దేవుడు.! వెంకయ్యస్వామి అంటే నీకు తెలియదు! వారే చూసుకుంటారు పో! అన్నారు. తర్వాత ఆ పొట్టేళ్లు అమ్మడానికి పక్కఊరి కి వెళ్లారు. అక్కడ బేరం చేస్తున్నప్పుడు వీళ్ళు అమ్మదల్చిన పొట్టేళ్ళు అన్నీ ఉన్నాయి కానీ మా నాన్న పట్టుకుని ఇచ్చిన పొట్టేలు మాత్రం మాయమైంది. అది ఎలా మాయమైందో అర్థం కాలేదు. అందరూ కలిసి వెతికాం చివరికి కనిపించలేదు. ఇన్ని పొట్టేళ్లలో ఆ పొట్టేలు

మాత్రమే మాయం కావడం అది స్వామి మహిమే అని తెలిసి ఆ గొర్రెల యజమాని మా నాన్న దగ్గరకు వచ్చి "మీ దేవుడు నువ్వుచెప్పినట్టు సత్యమైన దేవుడే నాకు ఈవిధంగా జరిగింది నన్ను మన్నించండి" అన్నారు. వెంకయ్య స్వామి వారి మహిమ తెలుసుకొని వారు అబ్బుర పోయారు.

మరొక రోజు వేరుశనగకాయలు మొదళ్లను బండికి ఎత్తుతుండగా అందులో ఒక మండ్రిగబ్బ (పెద్ద తేలు లాంటిది) ఉన్నది. అది జానెడంత ఉంది. మా నాన్న దాని గమనించక ఆ మొదళ్లను తీసి బండిలో వేస్తుండగా అది చేతిలో ఉండి కుట్టేసింది. మా నాన్న దాన్ని అట్లాగే చేత్తో నలిమేశారు.అది చనిపోయింది. మా నాన్నగారికి నొప్పి బాధ బాగా తీవ్రమైంది. మా ఊరికి 15 కిలోమీటర్ల దూరంలో హాస్పిటల్ ఉంది. మా అమ్మ వెంటనే హాస్పిటల్ కి వెళ్ళమంది. కానీ మా నాన్న ఏడుస్తూ ఉన్నాడు. కానీ బాధ భరించలేక ఉన్నాడు.

అప్పుడు మా నాన్న అన్నారు *"వెంకయ్య స్వామి వారు బ్రతికిస్తే బతుకుతాను... లేకుంటే చస్తానన్నాడు."* ఆ మాట అన్న వెంటనే ఆరడుగుల ఎత్తు 70 ఏళ్ల వయసు తెల్ల పంచ తెల్లని చొక్కా ధరించిన ఒక వృద్ధుడు ఆ దారి వెళుతూ మానాన్నబాధ చూసి దగ్గరకు వచ్చి ఏమయ్యా ఏడుస్తున్నావు? అన్నాడు. 'మండ్రగబ్బ కుట్టింది పెద్దాయనా' అన్నాడు. నొప్పిగాఉందా అని అడిగాడు. చాలా నొప్పిగా ఉంది అన్నాడు. అలాంటి కొన్ని ప్రశ్నలు వేసి , నీదగ్గర తీపి ఉందా అని అడిగారు! "నొప్పితో అల్లాడి పోతున్న మా నాన్నగారు విసుక్కు ని 'తీపిలేదు.. చేదు లేదు. నువ్వు ఇక్కడి నుంచి వెళ్ళు అని.. నాబాధ తో నేనుంటే, నీకు మాత్రం చెలగాటం గా ఉంది " అని ఆముసలాయనను మా నాన్నగారు కసురుకున్నాడు. ఆ పెద్దాయన ఏమి మాట్లాడకుండా వెళ్ళిపోయాడు. మా పొలం పక్కనే మా ఊరు. ఆ ముసలాయన ఊర్లోకి వెళ్లి కొంచెం బెల్లము, ఒక గుడ్డ తీసుకుని వచ్చాడు. నేను నీకు కట్టు కడతాను తొందరగా మేలవుతుంది అని చెప్పారు. కానీ వీరుమాత్రం నొప్పికి తట్టుకోలేక భరించలేకున్నారు. ఆ ముసలాయన ఆ బెల్లం నూరి, కట్టు కట్టి ఇక పోతుందిలే అని వెళ్ళిపోయాడు.

ఈ ముసలాయన కొద్ది దూరంగా వెళ్ళాడో లేదో వెంటనే బాధంతా మటుమాయమైంది. ఒక్కసారిగా చాలాహుషారు గా మారిపోయి మా నాన్న *"నాకు నొప్పి తగ్గింది. చాలా బాగుంది అంటూ, ఆ ముసలాయన అక్కడ ఇళ్లలో ఉన్నాడు వెళ్లి తీసుకురండి"* అని చెప్పారు. అప్పుడు మా అన్న వెంటనే వెళ్లి చూశారు మా ఊరు కేవలం 70 ఇళ్ళు మాత్రమే ఉన్నాయి. అక్కడ అంతా వెతికాము ఆ బయలు ప్రాంతం అంతా చూసాము వారు కనిపించలేదు.

మా నాన్నగారు <u>ఎప్పుడైతే "వెంకయ్యస్వామి బతికిస్తే బతికిస్తాడు, లేదంటే నన్ను తీసుకెళ్తాడు" అని ఎప్పుడైతే అన్నారో వెంటనే ఆపెద్దాయనరావడం, పరామర్శించి కట్టుకట్టడం ఇదంతా చూస్తే అప్పుడు మాకు అర్థమైంది- భగవాన్ శ్రీ శ్రీ శ్రీ వెంకయ్య స్వామి వారే వచ్చి మా నాన్నగారిని రక్షించాడని</u>, మా కెలాంటి ఇబ్బందులు ఎదురైనా శ్రీ వెంకయ్య స్వామి వారిని తలచిన వెంటనే వారు వెన్నంటి

ఉండి కాపాడుతూనే ఉన్నారు.

ఆ మహానుభావునికి ఏమిచ్చి ఋణం తీర్చుకోగలం? ఆజన్మాంతం వారికి ఋణపడి ఉంటాం। వారి దివ్య ఆశీస్సులు మాపై ప్రసరింప చేయాలి , ఆ మహానుభావునికి మా యొక్క శత సహస్ర కోటి ప్రణామాలు అని ప్రార్థిస్తున్నారు అశోక్ చక్రవర్తి.

ఓం నారాయణ - ఆది నారాయణ

శ్రీ పార్థసారధి
నేమమ్, తమిళనాడు



నేను 'నేమమ్' గ్రామంలో గ్యాస్ సిలిండర్లు ఆటోలో వేసుకుని ఇళ్ళకు(హోమ్-డెలివరీ) తేసుకెళ్ళి ఇచ్చేవాడిని . అదే నా జీవనం. 2018 సం. లో మా బంధువులు ఇంటికి భోజనానికి పిలిచారు . నేను వెళ్లి అక్కడ భోంచేసి వచ్చిన తర్వాత అస్వస్థత చెంది మతిభ్రమించి పిచ్చి పట్టింది. ఎక్కడెక్కడో చూపించాను కానీ నాకు నయం కాలేదు. మా ఇంటికి దగ్గరలో ఒక గురూజీ ఉన్నారు. ఆయన పేరు కుమారస్వామి. అప్పటికి ఆయనకు 50 సంవత్సరాలు. వారు తెల్లవారుజామున 3 గంటలకు అమ్మవారి పూజ చేసి ,అప్పుడే ప్రశ్నలు కూడా చెప్తారు. మేము వెళ్లి ప్రశ్న అడిగాము. ఆయనకు అమ్మవారు చెవిలో చెప్తారట, ఆయన పూజలో చాలాసేపు ధ్యాన నిమగ్నులై తర్వాత అయ్యా ! "భగవాన్ వెంకయ్య స్వామి అనే మహాత్ముడు నెల్లూరు దగ్గర గొలగమూడిలో సమాధి చెందారు, నీవు అక్కడికి వెళ్లి ఆరు నెలల పాటు అక్కడే ఉండాలని తరువాత వారి ఆజ్ఞ తీసుకొని అక్కడి నుండి ఊరికి వెళ్లాలి" అని అమ్మ వారు చెబుతున్నారు. కాబట్టి నువ్వు గొలగమూడి వెళ్లి ఆరు నెలల పాటు అక్కడ ఉండి వారు ఆజ్ఞాపించిన తర్వాత నీవు తిరిగి వచ్చేయన్నారు.

నాకు నమ్మకంకుదిరి మా గురూజీ మాట విని గొలగమూడి కెళ్ళాను. అక్కడ పెసల సుబ్బరామయ్య సార్ వారి ఆశ్రమంలో అనగా 'సాయి మాస్టర్ నిలయం'లో ఆరు నెలల పాటు ఒక్కడినే ఉన్నాను.నాకు మతిస్థిమితం సరిగ్గా లేక ఎప్పుడంటే అప్పుడు బయటకు వెళ్లి వచ్చేవాడిని. సుబ్బరామయ్య సార్ ఆశ్రమంలో రాత్రి 10 గంటల తర్వాత ఎవరు బయటకు వెళ్లకూడదు లోపలికి రాకూడదు. కానీ నేను ఎప్పుడంటే అప్పుడు వెళ్లేవాడిని. నా పరిస్థితి చూసి వారు కూడా ఏమీ అనేవారు కాదు. అలా ఆరు నెలలు గడిచిపోయాయి. నాకు ఆరోగ్యం చక్కబడింది .పిచ్చి పూర్తిగా నయమైంది. శ్రీ వెంకయ్య స్వామి వారు నాకు స్వప్న దర్శనమిచ్చి "అయ్యా! నీకు ఆరోగ్యం చక్కబడింది, మేలు చేశాను, నీవు ఇంటికి వెళ్ళవచ్చు . కానీ నెలకు ఒకసారి ఇక్కడికి వచ్చి దర్శించి వెళ్ళాలి" అనిచెప్పారు. నేను 'అలాగే స్వామీ' అని స్వామికి నమస్కరించుకొని మా ఊరు వెళ్లాను.

మరలా నేను గొలగవాడికి వెళ్లలేదు. నాలుగు నెలల తర్వాత మరల పిచ్చి మొదలైంది. నేను మరలా మా గురూజీ దగ్గరికి వెళ్లి అర్ధరాత్రి మూడు గంటలప్పుడు వారు పూజలో ఉన్నప్పుడు వెళ్లి ప్రశ్న అడిగాను . అమ్మవారు ఇలా చెప్పారు *“వెంకయ్య స్వామి వారు చెపున్నారు నీవు నెలకు ఒకసారి గుడి దర్శనం చేసుకుంటానని ఒప్పుకుని మరలా వేళ్లలేదట అందుకు నీకు మరల మొదలైంది !!! నీవు గొలగమూడి కి వెళ్లి దర్శించుకో”* అన్నారు. తర్వాత శ్రీ భగవాన్ వెంకయ్య స్వామి వారిని దర్శించి, "స్వామీ ప్రతినెలా రావాలంటే నాకు చాలా ఇబ్బందిగా ఉంటుంది, నేను ఒకరి దగ్గర పని చేస్తున్నాను, మీ ఫోటో ఇంట్లో పెట్టుకుని పూజిస్తాను, నా జీవితంలో ఎప్పుడైనా ఒకసారి పాదయాత్ర వస్తాను అని చెప్పుకొని వచ్చేసాను. అటు తరువాత నా ఆరోగ్యం పూర్తి చక్కబడి ఈరోజు వరకు అనగా 9వ తేదీ మే నెల 2023 నాటి వరకు నా ఆరోగ్యం బాగా ఉన్నది. నేను పాదయాత్ర వెళదామన్నా ఎవరు తోడు రాక ఇప్పటికీ పాదయాత్ర పోలేకున్నాను. వారికి జీవితాంతం రుణపడి ఉంటాను. భగవాన్ శ్రీ శ్రీ శ్రీ వెంకయ్య స్వామి వారు నాకు పాదయాత్ర చేసే అవకాశం ఎప్పుడు కల్పిస్తా రో!

ఓం నారాయణ - ఆది నారాయణ

శ్రీమతి మాధవిలత,
అనంతపురం.

2006వ సంవత్సరంలో నేను ( మాధవిలత) అనంతపూర్ లో స్త్రీ శిశు సంక్షేమ శాఖ కు చెందిన మహిళా ప్రాంగణంలో ఫ్యాషన్ డిజైనర్ ఇన్స్ట్రక్టర్ గా పనిచేస్తున్నాను. అక్కడ మహిళలకు సెల్ఫ్ ఎంప్లాయిమెంట్ కొరకు కొన్ని కోర్సులు ప్రభుత్వం తరఫున ట్రైనింగ్ ఇస్తూ, ఉచిత హాస్టల్, భోజన సదుపాయాలు వసతులు కల్పిస్తూ, టెక్నికల్ కోర్సులు శిక్షణ ఇస్తారు. అక్కడ హాస్టల్ వార్డెన్ ఒకామె విద్యార్థుల పట్ల కఠినంగా ప్రవర్తించేది. అలాంటి వాటిలో ఆ విద్యార్థులలో ఒక విద్యార్థిని ఏదో చిన్న పొరపాటు చేసి నందుకు ఆరోజు మధ్యాహ్నం టీ తయారు చేసి ఉంచిన tea (టీ) ని ఎవరికి ఇవ్వకుండా అంతా పారేయడం జరిగింది. అక్కడ విద్యార్థులు ట్రైనింగ్ పూర్తి అయ్యేంతవరకు ఆ ప్రాంగణం నుండి బయటికి వెళ్లే ప్రసక్తి లేదు. అక్కడ ఏమి దొరికితే అవి మాత్రం తిని ఉండాల్సిందే. ఆమె ‘టీ’ ని పారవే సినందుకు విద్యార్థులంతా బాధపడ్డారు. బయటికి వెళ్లి తాగడానికి కూడా వీలుపడదు.

విద్యార్థులు అందరూ టీ బ్రేక్ తరువాత క్లాస్ కి అటెండ్ అయ్యి నాతో చెప్పుకున్నారు (మాధవిలత గారితో చెప్పుకున్నారు.) అప్పుడు నేను వెంకయ్య స్వామి వారి గురించి తెలిపి,స్వామి వారి దారం వాళ్లకి ఇచ్చి, ఆమె కూర్చొనే ఆసనంకు ( సీటు) ఈ దారం కట్టండి అని ఇచ్చారు. ఆమె లేనప్పుడు ఈ దారం ఆ కుర్చీకి కట్టారు. మరుసటి రోజు హాస్టల్ వార్డెన్ గారు విద్యార్థులు అందరిని పిలిచి "మీ పట్ల దురుసుగా ప్రవర్తించినందుకు చాలా బాధపడ్డాను, ఇలాంటి తప్పు

ఇంకొకసారి జరగకుండా చూస్తాను" అని పరోక్షంగా మన్నించండి అనే విధంగా వారందరితో మాట్లాడుతూ ఆరోజు స్పెషల్ గా 'టీ' చేయించి, వారందరి చేత తాగించి, ప్రేమాభిమానాలు చూపించారు. అంత త్వరగా ఆ వార్డెన్ లో వచ్చిన మార్పుకు అందరూ నిర్ఘాంత పోయారు. మరుసటి రోజు విద్యార్థులు అందరూ నాకు ఈ విషయం చెప్పి చాలా సంతోషించారు.

ఆమె భర్త శ్రీ ఉమామహేశ్వర రావు గారు (హెడ్ కానిస్టేబుల్ గా పనిచేస్తున్నారు) ఇలా చెప్తున్నారు :

నేను మొదటిసారిగా 2003 డిసెంబర్లో గొలగమూడి భగవాన్ శ్రీ శ్రీ వెంకయ్య స్వామి వారిని దర్శించుకున్నాను .నేను నా సొంత తమ్ముడు బాలాజీ, మా మేనమామ వేణుగోపాల్ రాజుగారు కలసి గొలగమూడి కి వచ్చాం. అప్పటి వరకు నాకు గొలగమూడి ఎక్కడుందో కూడా తెలియదు. నాకు వరుసకు అన్నయ్య 'ఉపేంద్ర శేషసాయి రాజు' గారు 'అవధూతలీల' పుస్తకం ఇచ్చి "ఇది పారాయణం చేస్తే వెంకయ్య స్వామి వారే ఇంటికి వచ్చి భోజనం చేస్తారు", ఆయన చాలా గొప్పవారు, అని చెప్పారు. అప్పుడు నేను అనుకోని సంఘటనలో ఇరుక్కుని 'సస్పెండ్' లో ఉన్నాను. వెంటనే నాకు ఒక మంచి అభిప్రాయం ఏర్పడింది .

వెంకయ్య స్వామి వారి ఫోటో చూడగానే నాకు ఒక నమ్మకం ఏర్పడింది ఆయనకు మాల వేస్తారని కూడా నాకు తెలియదు, కానీ నేను ఇక్కడ తెల్ల దుస్తులు ధరించి ఇది వెంకయ్య స్వామి మాల అని బాబా డాలర్స్ తులసి పూసలదండ లో వేసుకొని మూడు సప్తహాలుగా పారాయణ చేసి, అనగా 21 రోజుల దీక్ష చేసి గొలగమూడికి వచ్చాము . అది డిసెంబర్ నెల 2003 సంవత్సరం ముక్కోటి ఏకాదశి, అక్కడ అంతబాగా జరుగుతుందని మాకు తెలియదు, అక్కడ అందరూ కాషాయ వస్త్రాలు ధరించి ఉన్నారు అది వెంకయ్య స్వామివారి మాల అని చెప్పారు మేము గొలగమూడి చేరగానే ఉండటానికి రూమ్ తీసుకున్నాము . అప్పుడు ఆఫీసు రూమ్ పై మాత్రమే రూములు ఇస్తారు, మరెక్కడా లేవు. ఆ పైకి మెట్లు దాదాపు 25 ఉంటాయి మా మామగారికి గతంలో పెరాల్సిస్ వచ్చి అప్పుడే కోలుకున్నారు కొంత దూరం నడువ గలరు కానీ మెట్లు ఎక్కలేరు . కానీ మాతో పాటు అతను అదేమీ గమనించకుండా ముగ్గురం ఆఫీస్ పైన ఉన్న గదిలోకి వెళ్ళాము. మెట్లపై నుంచి, గదిలో వచ్చిన తర్వాత మా మామగారు నాతో అరే నేను అసలు మెట్లే ఎక్కలేని వాడిని అన్ని మెట్లు ఏ సపోర్టు లేకుండా పైకి ఎక్కగలిగాను అన్నారు. నేను నిజమా మామ అంటే , అవునురా ఇప్పుడు చూపిస్తా పద ,అని చెప్పి వెంటనే వచ్చి దిగి సాధారణంగా పైకి ఎక్క గలిగాడు అది చూసి అందరం ఆశ్చర్యం లో మునిగిపోయాము.

ఇది ఒక అద్భుతమైన లీల ఎందుకంటే నేను మొట్ట మొదటిసారిగా అవధూతలీల మూడు సార్లు పారాయణం చేశాను. కానీ నేను చదివేటప్పుడు ఆ

పుస్తకంలో ఉన్న లీలలు లో 'ఒకటి జరిగి ఉంటే వంద రాసి ఉంటారు ఇవన్నీ కల్పితాలు' అనుకున్నాను కానీ ఈ లీల చూసి చాలా సంతోషించాను. అది నా దృష్టి లో మొట్ట మొదటిసారి గా జరిగిన లీల. అప్పుడు మా మామగారు చెప్పారు ఒరేయ్ నాకు మొన్నటి రాత్రి కల వచ్చింది ఆ కలలో నేనొక మిద్దెపై ఉన్నాను ఒక విమానం నన్ను తరుముకుంటూ వచ్చింది ఆ విమానం లోని వారందరూ గొడ్డళ్ళు , కొడవళ్ళు , ఈటెలు మున్నగు మారణాయుధాలతో కనిపిస్తూ నా మీదకు విసిరారు అప్పుడు నేను ధైర్యంగా 'నాకు వెంకయ్యస్వామి వారు ఉన్నారన్నా' ను వెంటనే శ్రీ వెంకయ్యస్వామి వారు నా పక్కనే నిల్చుకొని పొడుగాటి కర్ర పట్టుకుని ఉన్నారు. నాపై విసురుతున్న ఆ ఆయుధాలు నన్ను ఏమి చేయలేదు ఆ విమానం లోని వారందరూ శ్రీస్వామి వారిని చూడగానే భయపడి వెళ్లిపోయారు. నేను సంతోషంగా కిందికి వచ్చాను ఈ కలవచ్చినప్పటి నుండి నా ఆరోగ్యం బాగుందన్నారు. అప్పటి నుండి వారు మరణించేదాకా అనగా దాదాపు ఎనిమిది సంవత్సరాలు (పక్షవాతం వచ్చిన తరువాత కూడా) హాయిగా నడుస్తూ, ఆరోగ్యంగానే ఉన్నారు .సునాయాస మరణం కూడా పొందారు.

సూచన : ఈ లీలను చెప్పిన ఉమామహేశ్వర రావు గారి కి కూడా శ్రీ స్వామి వారు తమ దివ్య అనుభవంతో అతని సస్పెన్సన్ ను తొలగించారు, ఆ లీల వేరే పుస్తకం(అసాధ్యం – సుసాధ్యం) లో వివరించ బడింది .

ఓం నారాయణ - ఆది నారాయణ

దల్లి లక్ష్మీరెడ్డి,
విశాఖపట్నం

నా పేరు దల్లి లక్ష్మీరెడ్డి విశాఖపట్నం లో ఉంటున్నాను. ప్రతి రోజూ స్వామివారి జీవితచరిత్ర అవధూతలీల చదువుతాను . నా కుడిచేతి మధ్య వేలు మీద పులిపిరి కాయ లాగా వచ్చింది. అది రోజు రోజుకు పెరిగి కొంచెం పెద్దదయి పనులు చేసుకోవడం ఇబ్బంది అయ్యింది. డాక్టర్ దగ్గరికి వెళ్తే చిన్న మైనర్ సర్జరీ చేసి22 జూన్,2022న ఆ కాయ తీసేశారు, కానీ సరిగ్గా 20 రోజులకి అంటే జూలై 11వ తేదీ మళ్లీ ఆపరేషన్ చేసిన దగ్గరే నొప్పి పుట్టింది. తెల్లవారు లేసి చూసేసరికి మానిపోయిన దెబ్బ పక్కన మళ్ళీ ఇంకో చిన్న కాయ వచ్చింది అదికూడా రోజు రోజుకి పెరుగుతూ చింతకాయ అంత పెద్దదయింది. మళ్లీ డాక్టర్ దగ్గరికి వెళ్తే డాక్టర్ గారు డౌట్ వచ్చి సర్జన్ కి చూపించమన్నారు కొంచెం భయమేసింది, మళ్ళీ ఏమి వినాల్సి వస్తుందో అని ఆరోజు ఇంటికి వచ్చాక స్వామివారికి దండం పెట్టుకున్నాను. ఇంతమందికి ఇన్ని అనుభవాలు ఇస్తున్నారు కదా నా చెడుకర్మ ఏమైనా ఉంటే తీసేసి ఈ కాయకి ఆపరేషన్ లేకుండా తగ్గేటట్టు చేయమని ప్రార్థించాను. వెంకయ్య స్వామి వారి నూనెలో, పూండి స్వామి వారి ఊదీ కలిపి రోజూ రాసుకున్నాను. వారం లోపల ఎలా వచ్చిన కాయలు అలాగే పోయాయి. డాక్టర్ గారికి చూపిస్తే చాలా ఆశ్చర్యపోయారు ఎంతో అద్భుతం.

నా రెండు మోకాళ్ళకి నీ(knee) రీప్లేస్మెంట్ సర్జరీ జరిగింది. ఆపరేషన్ లో ఏ బాధ అనుభవించకుండా అంతా సవ్యంగా జరిగితే పూండిస్వామి, వెంకయ్యస్వామివారి దర్శనానికి వస్తానని దండం పెట్టుకున్నాను. నాకు తెలిసిన వాళ్ళలో, మోకాళ్ళకి ఆపరేషన్ చేయించుకున్న ప్రతి ఒక్కరూ నొప్పితో బాగా ఏడ్చారు కానీ, నేను మాత్రం స్వామి దయ ఒక్క రోజు కూడా నొప్పికి బాధపడి ఏడ్చింది లేదు. అంతా స్వామి దయ. నేను చాలాసార్లు కాలు  స్లిప్ అయి పడిపోయాను ఏమీ కాలేదు. కానీ ఒకసారి మంచం మీదనుంచి పడిన తరువాత , నాకు  వెన్నుపూస పక్కకి జరిగిందని చెప్పారు డాక్టర్లు . దీనికి ట్రీట్మెంట్ ఆపరేషన్ ఒక్కటే- అని చెప్పారు.

నేను స్వామి మీద నమ్మకం తో ఇప్పుడు జరిగిన ఆపరేషన్ చాలు ఇంక మరి చేయించుకోనని నిర్ణయించుకుని, ఏ ఆపరేషన్ చేయించుకోలేదు. ప్రతి రోజు స్వామి నూనె రాసుకుంటాను లేచి తిరిగి పని చేసుకుంటాను  మళ్ళీ రాత్రి నూనె రాసుకొని పడుకుంటా అంతే.  నా పని నేను చేసుకోవడానికి స్వామి శక్తినిస్తున్నారు. ఇది చాలు నాకు అని అంటున్నారు లక్ష్మి గారు.

<u>ఓం నారాయణ - ఆది నారాయణ</u>

శ్రీమతి కాదంబరి,
విశాఖపట్నం.

*నామజపం- అన్య చింతన :*

నా పేరు కాదంబరి, నాకు 2003  లో స్వామి వారి గురించి తెలిసింది నాకు స్వామివారితో చాలా అనుభవాలు ఉన్నాయి పెసల సుబ్బరామయ్య గారు స్వామివారి దగ్గరికి వెళ్లేటప్పుడు నామ జపం చేసుకుంటూ ఇడ్లీలు పట్టుకెళ్తే తినేవారు చదివి , అలాగే నేను స్వామి దర్శనానికి విశాఖపట్నం నుంచి బయలుదేరేటప్పుడు నుంచి *నామ జపం చేసుకుంటూ వస్తే స్వామివారి ఆశీస్సులు అనుగ్రహం చాలా బాగా లభించేది*- అంటే మంచి రూము దొరకడం దర్శనం బాగా జరగడం ప్రదక్షిణ చేయడం అన్ని బాగా జరిగేవి ఒక రకమైన ఒక విధమైన ప్రశాంతత దొరికేది అదే కానీ *వేరే ఆలోచనలతో అన్యచింతలతో వస్తే అన్నీ ఇబ్బందులే ఎదురయ్యేవి మంచి రూమ్  దొరికే ది కాదు అశాంతి ఎక్కువగా ఉండేది* రెండు రోజులు ఉందామని వచ్చే దాన్ని ఒక్క రోజులో వెళ్ళిపోయే దాన్ని వెనక్కి. ఉండలేకపోయేదాన్ని.

ఇది మన అందరికీ ఒక పాఠం. స్వామి వారి దగ్గరకు ఎలా రావాలి , ఎలా ఉండాలి అనేది మనం తెలుసుకుని సమయం స్వామికే సమర్పిస్తే వారి అనుగ్రహం కూడా అలాగే పొందుతాము , లేకుంటే రూపాయికి పావలా ఫలితం.

ఓం నారాయణ - ఆది నారాయణ

15 Aug 2023,
సతీష్, నార్త్- కెరోలేన ,
అమెరికా.

నాపేరుసతీష్, భగవాన్ వెంకయ్య స్వామి వారి దయ వలన, నాకు అమెరికా లో జాబ్ వచ్చి ఇక్కడే ఇల్లు కొనుక్కున్నాను.

శ్రీ స్వామి భక్తులతో స్వామివారి లీల పంచుకొవాలనుకుంటునాను. అమెరికాలో మాఇంటి ప్రక్కన వుండే అతని ఇంటికి అతని అత్తగారు, మామగారు వచ్చారు, వీరితో సంతోషంగా కొద్ది రోజులు గడిపిన తరువాత, అందరూ కలిసి మన దేశానికి రావటానికి విమానం టిక్కెట్స్ తీసుకున్నారు . కానీ అకస్మాత్తు గా ఆరోగ్యపరమైన సమస్య వచ్చింది. ఇది జరిగి సరిగ్గా ఈ నాటికి నెల రోజులు అయ్యింది. అతనికి బ్రెయిన్ ట్యూమర్ ఉంది అని, అది క్యాన్సర్ ఆయి ఉండవవచ్చేమోనని డాక్టర్ చెప్పారు. రెండు రోజులు పాటు హాస్పిటల్ లోనే ఉంచి పలువిధాలైన టెస్టులు చేసి, క్యాన్సర్ కాదని, కానీ అది నయమవ్వాలి అంటే కొన్నిరోజులుపాటు మెడిసిన్ వాడాలని, ఇప్పుడే ఏమి ఖచ్చితంగా చెప్పలేమని చెప్పారు.

వారి పరిస్థితి ఎలా ఉందంటే, వారంరోజుల పాటు అతను బ్రతకగలిగితే భార్య, పిల్లన్ని వాళ్ళు సొంతఊరికి పంపి వారికి ఆధారంగా ఏమైనా ఏర్పాటు చేయగలను అని, బాధపడుతున్నాడు. మాకు ఈ విషయం తెలిసి వారింటికి వెళ్లి చూసినప్పుడు అతని భార్య, అత్త గారు మరియు వాళ్ళ పాప ఏడుస్తూ ఎంతో దుఃఖం లో వున్నారు, చూడగానే మాకు ఆ పరిస్థితి ఎంతో negative, hopeless గా అనిపించింది, అతను కూడా చాలా అనారోగ్యకరమైన పరిస్థితిలో ఉన్నారు. బ్రెయిన్ లో ట్యూమర్ ఉండటం వల్ల తల ఏమాత్రం ప్రక్కుకు తిప్పినా విపరీతమైన తలపోటు, కళ్ళు తిరగడం, వాంతులతో అతని పరిస్థితి చాలా బాధాకరంగా వుంది. అప్పటికి అతను భోజనం చేసికూడా వారం రోజులు అయింది, ఆహారం గురించి విన్నా కూడా వాంతులు అవుతున్నాయి, అంతటి దీన స్థితిలో ఉన్నారాయన.

అప్పుడు మేము మాకు కలిగిన, స్వామి వారు ఇచ్చిన అనుభవాలు కొన్నింటిని వారితో పంచుకున్నాము, మాకు ఎవరు లేని సమయంలో స్వామి వారు, సాయినాధుల వారు, శ్రీ మాస్టర్ గారు మాకు తోడు గా వుండి ఎలా నడిపించారో చెప్పాము, వారు కూడా స్వతహాగా శ్రీ సాయి భక్తులు కావడం చేత ప్రతిరోజు శ్రీ సాయినాధుల పటానికి ప్రదక్షిణలు చేయమని, శ్రీ గురుచరిత్ర పారాయణ చేయమని మరియు శ్రీ స్వామి వారికి మ్రొక్కు చెప్పుకోమని చెప్పాము.

వారి పరిస్థితి చూసి మేము కూడా చాలా బాధ పడ్డాము, గురుబంధువులు నగేష్ అన్నకి ఫోన్ చేసి , ఈ విషయం అంతా చెప్పి వారి సలహా కోరాము. వారు మా దగ్గర ఉన్న శ్రీ స్వామి వారి అవధూత లీల, మరియు శ్రీ సాయిలీలామృతం, స్వామి దారం, ఫోటో ఇవ్వమని చెప్పారు, వారు కూడా

సహృదయంతో శ్రీ స్వామి వారి ధుని కి కొబ్బరికాయలు సమర్పించారు. మేము బుక్స్ అన్ని ఇచ్చి( అవి మేము పారాయణ చేసుకుని, నిత్యమూ దేవుని సన్నిధి లో ఉంచుకున్న గ్రంధాలు) స్వామి వారిని దర్శించుకుంటామని మ్రొక్కుకోమని, వీలైనంత సేపు ప్రదక్షిణాలు చేయమని చెప్పాము.

వారు ఆవిధంగానే స్వామి వారికి మొక్కు కొన్నారు. సరిగ్గా వారం రోజులకి కొంచం ఆరోగ్యం స్థిమితపడింది, వారి కుటంబం కూడా కాస్త స్థిమిత పడి, ఆహారం కొంచం తీసుకుంటున్నారని చెప్పారు. అతను కూడా ఆ తరువాత పలుమార్లు కనిపించి చాలా తేలికగా వుందని, ముందు ఉన్నంత ఇబ్బంది ఏమీ లేదని నార్మల్ లైఫ్ కి రాగలుగుతున్నానని చెప్పారు. గత వారం నుండి ఆఫీస్ పని కూడా చేసుకుంటున్నారు. ఇదంతా దగ్గర నుండి చూసిన మాకు చాలా ఆశ్చర్యం గాను ,మరియు ఆనందంగానూ అనిపించింది. ఇదంతా శ్రీస్వామివారి కృప కాక మరేమీ కాదని మాకు అనిపించింది, అసలు ఆశ లేని పరిస్థితి లో,లేచి కూర్చోడం, మాట్లాడటం కూడా చాలా కష్టంగా ఉన్న అతను ఇప్పుడు ఆరోగ్యంగా తిరుగుతున్నారు, ఇది కేవలం శ్రీస్వామి వారు, శ్రీ సాయినాధులవారు, శ్రీ దత్తాత్రేయ స్వామి వారి కృప అని మా నమ్మకం.

ఓం నారాయణ - ఆది నారాయణ

కొన్ని సమస్యలు కొంతమందికి చిన్నవి.కాని అవే కొంతమంది కి చాలా పెద్దవై మనస్సుని బాధించి, దిగులుపెట్టి, నిద్రకూడా పోనివ్వవు. కరుణాసముద్రుడు వెంకయ్యస్వామి వారు వాటిని కూడా పరిష్కరించి భక్తులకు మనశ్శాంతిని, విశ్వాసాన్ని పటిష్ట పరిచారు. క్రింద లీలలో శ్రీ బాలయ్య గారికి స్వామివారు కలలో దిగులు పడవద్దని చెప్పి నిదర్సనంగా బ్యాంకు వారే తమంత తామే ఫోన్'చేసి మరీ డాకుమెంట్స్ ఇచ్చేటట్లు చేసారు.

Tinnavelli బాలయ్య గారు, రిటైర్డ్ హెడ్ మాస్టర్,
మార్కాపురం

2007 సం|| కి ముందు నాకు 3 లక్షల పైగా విలువ చేసే ఆస్తి ఒకటి ఉండేది. ఆ ఆస్తి పత్రాలు నా దగ్గరే ఉన్నా, దానికి సంబంధించిన లింకు డాక్యుమెంట్లు బ్యాంకువాళ్ల దగ్గరే ఉండిపోయాయి. ఎన్నిసార్లు బ్యాంకుకి వెళ్లినా, “మీపత్రాలు ఎక్కడఉన్నాయో కనిపించడం లేదు, తర్వాతరండి” అని తిప్పి పంపి వేస్తున్నారు. ఆ లింకు డాక్యుమెంట్లు లేకుండా ఆ ఆస్తి అమ్మడం జరగనిపని. పోనీ వదిలేద్దామా అంటే 3లక్షలకు (2004 నాటికి) పైగా విలువ చేసే ఆస్తి. చూస్తూ చూస్తూ వదులుకోలేక, ఆ దిగులుతో దాదాపు కంటిమీద కునుకే కరువయ్యింది. ఆ డాక్యుమెంట్లు దొరకడం దాదాపు అసాధ్యం అని ఎంతో దిగులుపడి పోయాను.

సాఫ్ట్'వేర్ కంపెనీలో పని చేస్తున్న మా చిన్నకుమారుడు లక్ష్మీనారాయణ,

నా దిగులు చూసి ఆ మూడు లక్షలు నేను మీకు ఇస్తాను, మీరు దిగులు పడకండి అన్నాడు. కానీ నేను అంగీకరించలేదు. ఇంతలో కాలేజీ లో H.O.D. గా పని చేస్తున్న మా పెద్ద కుమారుడు రామమోహన్ తన సహఅధ్యాపకుల్లో ఒకరిద్వారా వెంకయ్యస్వామి మహత్యం తెలుసుకుని, ఆ స్వామిదివ్యలీలలను తెలిపే 'అవధూతలీల' గ్రంథాన్ని తెచ్చిఇచ్చి చదవమన్నాడు. నేను చదవటం పూర్తి చేసినరోజు రాత్రే స్వామివారు నాకలలో తంబురతో దర్శనం ఇచ్చి, నావీపు తట్టి "నీ కాగితాలు వస్తాయిలేయ్యా! దిగులుపడబాక" అన్నారు. నేను ఎంతో ఆశ్చర్యానందాలతో సమయం చుస్తే తెల్లవారి 5గం|| అవుతోంది. మాములుగా తెల్లవారు ఝామున వచ్చేకలలు నిజమవుతాయంటారు. కానీ ఎలాసాధ్యంఅవుతుంది అని కొంతసంశయం తో ఎదురు చూసాను. ఆహా! ఏమి ఆ వెంకయ్య స్వామి వారి అపారకరుణా, శక్తి సామర్థ్యాలు!!

నేను తిరిగి ఏ ప్రయత్నమూ చేయకుండానే, సాయంత్రం 4 గం|| లకు S.B.I. విజయవాడ, గన్నవరం బ్రాంచి మేనేజరు ఫోన్ చేసి మీ కాగితాలు దొరికినాయి, అవి మీ భార్యపేరు మీద ఉన్నాయి కనుక, ఆమెను తీసుకువచ్చి సంతకంచేయిస్తే, ఇచ్చేస్తాము అన్నారు. వెంటనే ఇద్దరమూ వెళ్లి ఆ డాక్యూమెంట్లు తెచ్చుకున్నాము. ఈ విధంగా అసాధ్యం అనుకున్న నాపనిని సుసాధ్యం చేసిన స్వామి వారి ఋణం నేను ఎప్పటికీ తీర్చుకోలేను. నా మానసిక వేదనని ఒక్క క్షణంలో దూరం చేసిన స్వామి వారిని నిత్యం స్మరించుకుంటూ వీలున్నప్పుడంతా గొలగమూడి వెళ్లి దర్శనం చేసుకుంటున్నాను.

ఓం నారాయణ - ఆది నారాయణ

వేలూరి రాజయ్య నాయుడు గారు
తుమ్మల తలుపూరు గ్రామం,
నెల్లూరు జిల్లా .

వేలూరి రాజయ్య నాయుడు గారు 'తుమ్మల తలుపూరు' గ్రామం .వీరు వీఆర్ కాలేజీలో పి.యు.సి దాకా చదువుకున్నారు. వీరిది పెద్ద కుటుంబం. అప్పట్లో పంటలు లేక చాలా ఇబ్బంది పడేవారు, ఇల్లు గడవడమే కష్టం. ప్రొద్దున్నే చద్దన్నం తిని, గడ్డపార తీసుకొని, తోటలో పనికి ఉదయాన్నే వెళ్లే వాళ్ళం. అట్లాంటి పరిస్థితుల్లో రాజయ్య నాయుడు గారు, వారి నాన్నగారు సాయంకాలం పూట ఒక మంచం బిగిస్తున్నారు. అప్పుడు ఒకాయన మా ఊరి పల్లెకు వెళ్లి బిక్ష తీసుకొచ్చేవారు. ఆయన ఒకరోజు సాయంకాలం రాజయ్య గారిని "అయ్యా వెంకయ్య స్వామివారు తాత మనవడును (రాజయ్యనాయుడు ను అలా పిలిచేవారు)నా దగ్గరకు రమ్మనయ్యా!" అన్నారు. వారు ముదిగేడు లో ఉన్నారు నువ్వంట వెళ్లయ్య అన్నారు. వెంటనే రాజయ్య నాయుడు గారు బయలుదేరగా , వారి తండ్రిగారు ఈరోజు వద్దు రేపు వెళ్ళు చీకటి పడుతుంది కదా అని చెప్పినా , వారు వినకుండా శ్రీ వెంకయ్య స్వామి వారిపై అపారమైన నమ్మకంతో బయలుదేరారు.

అడ్డదారిన మడి కట్లలో (సేద్యపు భూముల మధ్యలో ) పది మైళ్ళ దూరం అడ్డం నడుచుకుంటూ వెళ్ళాడు. అప్పుడు శ్రీ స్వామివారు అగ్నిగుండం వేసుకొని ఉన్నారు. స్వామివారికి నమస్కరించి, స్వామి నేను ‘ తాత మనవడి’ని వచ్చాను అని చెప్పగా "అయ్యా నువ్వు ఊర్లోకి వెళ్లి భోంచేసుకుని రావయ్యా" అన్నారు. కొంతమంది నన్ను చూసి ఈ అబ్బాయి ఎర్రగా బుర్రగా ఉన్నాడు సంగటి పెడితే ఎట్లాగని మా ఇంట్లో అన్నం లేదని చెప్పారు. మరొకరి ఇంటికి వెళితే వారు వరి అన్నం పెట్టారు. అది తిని స్వామి దగ్గరికి వచ్చి" స్వామీ బోంచేసాను అన్నారు "అట్లాగయ్యా! ఆ తాటి మట్ట తీసుకొని అక్కడ పడుకో! అని నీకు గండం ఉంది తీసేస్తానని చెప్పారు" ఆ రాత్రి మధ్యలో పెద్ద బుసలు వినిపించాయి అప్పుడు వెంటనే రాజయ్య గారు మెల్లగా కళ్ళు తెరిచి చూశారు" శ్రీ స్వామివారు అగ్నిగుండంలో కూర్చుని బుసలు కొడుతున్నాడు. వీరు అలాగే చూసి కొంతసేపటికి కళ్ళు వాటంత అవే మూతపడ్డాయి. ఉదయాన్నే లేచి స్వామివారికి నమస్కరించుకోగా అయ్యా నీకు గండం తీసేసాను నువ్వు ఇక్కడ ఉండకూడదు వెనక్కి తిరిగి అదేదారిలో వెళ్ళిపోయ్యా అన్నారు.

మరొకసారి స్వామివారి వద్దకు రాజయ్య నాయుడు గారి అక్కగారు వచ్చి, శ్రీ స్వామి వారికి ఇలా విన్నవించుకుంది,- “స్వామి మావాడు కొంతవరకు చదివాడు. ఎలాంటి ఉద్యోగం లేదు... మాకు ఇల్లు జరగడమే కష్టంగా ఉంది. కానీ ఏదో ఒక ఉద్యోగం వచ్చేలా చూడు స్వామి" అన్నారు. అప్పుడు శ్రీ స్వామి వారు "అబ్బో ఆయనకేమమ్మా డాక్టర్లు పరీక్షించనిదే అన్నం పెట్టరు. గవర్నమెంట్ సొమ్ము దండిగా తినాలని ఉందమ్మా!!! అంటూ ఈనవిమానాల్లోతిరుగుతాడయ్యా!!! అప్పుడప్పుడు చాటంత విమానాన్ని పంపిస్తుండయ్యా! ఆని శ్రీ స్వామి వారన్నారు. కానీ అప్పటి వాళ్ళ పరిస్థితి చాలా ఇబ్బంది కరంగా ఉంది.

ఈ రోజు అన్నం తింటే ఆ తర్వాత రెండు మూడు రోజులకే...." అది కూడా ఎప్పుడు వండు తారో కూడా తెలియదు." అన్ని నూకల దొరికినప్పుడు మాత్రమే వండుకొని తినేవారు. అట్లాంటి పరిస్థితుల్లో శ్రీ స్వామి వారు చెప్పినట్టుగానే ఎయిర్ ఫోర్స్ డిఫెన్స్ లో ఉద్యోగం వచ్చింది. చండీగఢ్లో అపాయింట్మెంట్ ఇచ్చారు. "అక్కడ డాక్టర్ల పరీక్షించనిదే వాళ్లకు అన్నం పెట్టరు" శ్రీ స్వామి వారు చెప్పిన మాట అక్షరాల నిజమైంది.

అటు తర్వాత సంవత్సరపు సెలవుల్లో భార్యాభర్తలిద్దరూ తుమ్మల తలుపూరు వచ్చారు. అప్పటికి వీరికి 80 రూపాయలు జీతం. అప్పుడు వెంకయ్య స్వామి వారి దర్శనం చేసుకున్నారు. తిరిగి వచ్చేటప్పుడు రెండు సార్లు పిలిచి అయ్యా ఇట్రాండయ్యా అంటూ ఒక రూపాయి తీసి వారికి ఇస్తూ "ఇది దగ్గర ఉంచుకోండయ్యా అవసరానికి ఉపయోగపడుతుంది" అంటూ ఒక రూపాయి ఇచ్చారు. సెలవులు అయిపోయిన తర్వాత తిరిగి చండీగఢ్ కు బయలుదేరారు. ఇక్కడి నుండి ఢిల్లీ దాకా వెళ్లి మరో ట్రైన్ మారుతూ చండీగఢ్ కి వెళ్ళాలి. వీరు ఢిల్లీకి వెళ్లి అక్కడ దిగారు. అప్పుడు వీరికి ఆకలి తీవ్రమైంది. వీళ్లు తెచ్చుకున్న

డబ్బులు అయిపోయాయి. చండీగఢ్ కి వెళితే అక్కడ మిలిటరీ వాహనాలు ఉంటాయి వారిని తీసుకువెళ్లడానికి. చార్జీలతో నిమిత్తం లేదు కానీ ఢిల్లీలో విపరీతమైన ఆకలేసింది. ఒకరి ముఖాలు ఒకరు చూసుకుంటున్నారు

"ఆమెకు శ్రీ వెంకయ్య స్వామి వారు ఇచ్చిన రూపాయి గుర్తొచ్చి ఏమండీ.. స్వామి వారి ఇచ్చిన రూపాయి ఉంది సూట్ కేసులో భద్రంగా ఉంచాను. అని చెప్పగా ఇప్పుడు ఆకలితో ఉన్నాము అని ఆ రూపాయి తీసుకొని తలా పావలాకు పూరీలు తిన్నారు. ఒక పావలాకు ఇద్దరు టీలు తాగారు. మరో పావల జేబులో వేసుకొని చండీగఢ్ కి వెళ్ళిపోయారు. ఆ విధంగా ఎప్పుడో మాకు అవసరం వచ్చే పరిస్థితిని వెంకయ్య స్వామి వారు తెలుసుకొని ఆ రూపాయి మాకు ఇచ్చారు. మా మామగారు . "నువ్వు ఎక్కడున్నా స్వామివారిని మరవకుండా తలచుకోవాలి" అని చెప్పారు

ఎయిర్ ఫోర్సులో నా సర్వీస్ పూర్తయిన తరువాత వచ్చి, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియాలో ఉద్యోగం కోసం అప్లై చేసుకుని, ఎగ్జామ్ రాయడానికి వెళ్లారు. కానీ ఎగ్జామ్ హాల్ లో కూర్చున్న తర్వాత ఆ ప్రశ్నలు ఏమిటో అర్థమే కాలేదు. అప్పుడు వీరు శ్రీ స్వామి వారిని మనసారా ప్రార్థించారు.

"స్వామీ! గతంలో మేము అన్నం లేక అల్లాడినప్పుడు మీరు మా పై దయ ఉంచి మా కుటుంబాన్ని నిలబెట్టారు. ఈ ఉద్యోగం వస్తే మేము ఇబ్బందుల నుంచి బయటపడినట్టే. ఇంతకాలం నుంచి కాపాడుతున్న మీరు నన్ను కరుణించండి స్వామి." అని ప్రార్థించగా ఒక అద్భుతం జరిగింది. "వెంటనే అదంతా చీకటిమయం అయిపోయినట్లు, చుక్కలు మాత్రం కనిపిస్తున్నట్లు, వారికి అదోరకమైన మత్తుగా ఉన్నట్టు ఉండిపోయింది. అటు తర్వాత మెలకువ రాగానే పరీక్ష టైం అయిపోయింది. ఆ పేపర్లో నేనేమి రాశానో ఏమో నాకే తెలియదు. కానీ పాస్ అయి స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియాలో చాలాకాలం పనిచేసి మేనేజర్ ప్రమోషన్ వచ్చి తరువాత రిటైర్ అయ్యాను. ఇన్ని చేసిన ఆ మహానుభావునికి నేను ఏమిచ్చి ఋణం తీర్చుకోగలను.

ఓం నారాయణ - ఆది నారాయణ

శ్రీ మహేష్ ,
అనంతపురం.



నా పేరు మహేష్ , పోలీస్ డిపార్ట్మెంట్ లో పని చేస్తున్నాను. నేను కానిస్టేబుల్ గా ఉన్నప్పుడు 2011 న కదిరి సబ్ డివిజన్ లో వసతి ఇచ్చారు, అక్కడే ఉన్నాను ప్రతిరోజూ తెల్లవారుజామునే స్నానం చేసి అవధూత లీల పుస్తకం చదవడం నాకు అలవాటు. ఆ విధంగా ఉదయం 7 గంటల వరకు పారాయణ చేసేవాణ్ణి అప్పుడు మిగిలిన సహోద్యోగులు అందరూ వచ్చేవారు.

అందులో ఒక కానిస్టేబుల్ రెడ్డప్ప నేను రోజూ చదువుతూ ఉండటం చూసి, 'అన్నా! మీరు ఏ పుస్తకం చదువుతున్నారు ఎవరా స్వామి' అన్నారు. నేను శ్రీస్వామి వారి గురించి వివరంగా చెప్పాను. ఆ అబ్బాయి చాలా సంతోషించి పుస్తకం అడిగాడు, ఇచ్చాను. ఒకసారి పారాయణం చేశారు, గొలగమూడి కి వెళ్లి నాలుగు రోజులు ఉన్నారు. తర్వాత నేను అక్కడి నుండి బదిలీ అయి వచ్చేసాను.

ఒక రోజు ఈ కానిస్టేబుల్ రెడ్డప్ప నాకు ఫోన్ చేశారు. అప్పుడు నేను వెంకయ్య స్వామివారి మాల ధరించి ఉన్నాను. విశేషాలు అడిగాను వెంటనే ఆ అబ్బాయి, అన్నా! సంవత్సరం వయసు ఉన్న మా అమ్మాయికి 'డెంగ్యూ ఫీవర్ వచ్చింది కదిరిలో డాక్టర్లు వెంటనే కర్నూలు తీసుకెళ్లామన్నారు. ప్రస్తుతం కర్నూల్ లో ఉన్నాము, ప్లేట్లెట్స్ బాగా తగ్గిపోయాయి, నిన్న మధ్యాహ్నం నుండి అమ్మాయికి మెడిసిన్స్ ( ఇంజెక్షన్ ) ఇవ్వడానికి నరం దొరకలేదు. ఇప్పటికి దాదాపు ఇరవై నాలుగు గంటలు అయింది అమ్మాయి పరిస్థితి ఏమీ బాగాలేదు' అని చెప్పాడు.

నేను వెంటనే *'వెంకయ్య స్వామి కి మ్రొక్కుకో! తప్పకుండా మేలు చేస్తాడు'* అన్నాను. '*నేను మొక్కాను అన్నా నువ్వు కూడా పాప గురించి ప్రార్థించు!'* అన్నారు నువ్వు ఇచ్చిన స్వామి ఫోటో కూడా నా దగ్గర ఉంది అన్నాడు,అప్పుడు నేను వెంటనే ఆ ఫోటో అమ్మాయి తలక్రింద ఉంచు అన్నాను . సరే అని అని ఫోన్ పెట్టేశాడు.

ఐదు నిమిషాల తర్వాత అబ్బాయి ఫోన్ చేశాడు సిలైన్ ఎక్కించ డానికి నరం దొరికింది ఇప్పుడు ఎక్కిస్తున్నారు అని ఎంతో ఆతృతతో చెప్పాడు . అదంతా స్వామి మహిమ అని చెప్పాను.

ఆ తర్వాత నుండి అమ్మాయికి జ్వరం రావటం గానీ, ప్లేట్లెట్స్ తగ్గడం గాని జరుగలేదు చాలా హుషారుగా తయారైంది. ఆ రోజు సాయంత్రం డాక్టర్లు అమ్మాయికి బాగుంది మీరు డిశ్చార్జి అయి వెళ్ళి పోవచ్చు అన్నారు.

కేవలం స్వామి ఫోటో పెట్టుకుని మొక్కు కొన్నందు వల్ల వీరి పాప కి డెంగు జ్వరం తగ్గటం , 24 గంటలనుండి దొరకని నరం వెంకటనే దొరకటం ఒక అద్భుతం. మరునాటి ఉదయం డిశ్చార్జ్ చేశారు.

ఆ అబ్బాయి తర్వాత కనిపించి కృతజ్ఞతలు తెలుపుకున్నారు. ఇలాంటి అద్భుతమైన లీలలు చేసి ఆ మహానుభావుడైన శ్రీ వెంకయ్య స్వామి వారు లక్షలాది మందిని కాపాడారు వారికి నా శత సహస్ర కోటి వందనాలు

ఓం నారాయణ - ఆది నారాయణ

శ్రీ నారాయణరావు,
సీతారామపురం, ఉదయగిరి మండలం
నెల్లూరు జిల్లా .

నమస్కారం.నా పేరు నారాయణరావు. మా నాన్నగారు రిటైర్డ్ హెడ్ మాస్టర్. నేను గతంలో సీతారామపురంలో పౌరోహిత్యం చేసేవాడిని, కానీ ఇప్పుడు ఆ పనిని పూర్తిగా మానేశాను. నా జీవితంలో, నా కుటుంబంలో గొలగమూడి వెంకయ్య స్వామి వారు చేసిన లీలలు,చూపిన కరుణ గురించి మనస్ఫూర్తిగా తెలియజేయాలని అనుకుంటున్నాను.

మా కుటుంబానికి ఇలవేల్పు మిట్టపాలెం నారాయణ స్వామి.ఆయన అనుగ్రహం వల్లే నేను జన్మించానని మా నాన్నగారు చెప్పారు. మా భార్య సాక్షాత్తు కాసిరెడ్డి నాయన చేతులతో పెరిగింది. కాసిరెడ్డి నాయన గారు మా మామగారికి ఒకటే కూతురు అని, ఆమెకు పుట్టే సంతానం అంతా మగ సంతానమే పుడుతుందని చెప్పారట. నాకు ఇద్దరు మగపిల్లలు ఉన్నారు.

మొదట, మా అత్తగారికి బ్రెస్ట్ క్యాన్సర్ వచ్చినప్పుడు నెల్లూరు హాస్పిటల్స్‌లో రోజుకు రూ 1200 రూము అద్దె చెప్పగా, కొంతమంది భక్తులు చెప్పడం వలన గొలగమూడి లో ₹150కే రూమ్, హాట్ వాటర్, బెడ్, మరియు మూడు రోజులు అన్నం లభిస్తుందని కాబట్టి గొలగమూడి నుంచి హాస్పిటల్ కి వెళ్తూ ఆమెను చూసుకోవచ్చని వచ్చాను. మూడు రోజుల వరకు స్వామివారు ఉన్నారని కూడా నాకు తెలియదు. మూడో రోజు గుడి ముందుకు వచ్చినప్పుడు గంట మోగింది. ఆ తర్వాత స్వామి గురించి తెలుసుకొని, కొంచెం నమ్మకం కలిగింది.

*మా తండ్రికి వెంకయ్య స్వామి ఇచ్చిన పునర్జన్మ – నా విశ్వాసం :*

తరువాత కొన్నాళ్ళకి మా నాన్నగారికి బీపీ, షుగర్, ఆస్తా్మ, లంగ్స్ ప్రాబ్లమ్స్ మరియు గుండెకు సంబంధించి రెండు వాల్వులు బ్లాక్ అయ్యాయి. అనుకోకుండా ఆయన కోమాకు వెళ్లారు. బొల్లినేని హాస్పిటల్‌లో చేర్పించగా, ఆయన 15 రోజులు ఐసీయూలో ఉన్నారు. ఆ తర్వాత జనరల్ వార్డుకు మార్చారు, అప్పుడు నేను 10 మంది డాక్టర్లను ఏర్పాటు చేశాను. వారు టెస్ట్‌లు చేసి, తెల్లవారేలోగా చనిపోతారు అని నిశ్చయంగా చెప్పారు. నేను డాక్టర్ మాటను దైవ వాక్కుగా భావించి, చనిపోతారని చెప్పటానికి బంధువులకు లిస్ట్ తయారు చేసుకుంటూ ఉంటే, నాకు కొంచెం నిద్ర అనిపించింది.

రాత్రి 1:30 - 2 గంటల మధ్యలో నేను పడుకున్నప్పుడు, నేను నిద్రపోతే నా మీద కర్ర వేయమని నాన్నగారికి చెప్పి పడుకున్నాను. కరెక్ట్‌గా తెల్లవారుజామున మూడున్నర సమయంలో, స్వామి వెంకయ్య వారు భౌతికంగా వచ్చి మా నాన్నగారిని తట్టి లేపి కూర్చోబెట్టి, నోట్లో చెయ్యి పెట్టి ఏదో తీసి పక్కన వేశారట

(అది ఏంటో ఆయనకు కూడా తెలియదు). ఆ తర్వాత ఆయనలో చలనం వచ్చి, బ్రతికారు. నాలుగు గంటలప్పుడు ఆయన నా మీద కర్ర వేశారు. నేను లేవగానే, ఆయనకు ఆకలి అవుతుందని, పాలు కావాలని అడిగారు. ఆ తర్వాత ఆరు గంటలకు సాంబార్‌తో రెండు వడలు కూడా తిన్నారు. తొమ్మిది గంటలకు వచ్చిన డాక్టర్లు "ఈ మనిషి ఎలా బ్రతికారు?" అని ఆశ్చర్యపోయారు. ఇంత అధ్భుతంగా లీల చూపి స్వామి నా తండ్రి ని బ్రతికించినందుకు నాకున్న నమ్మకం, సంపూర్ణ విశ్వాసంగా మారిపోయింది. ఇంకా వెంకయ్యస్వామే నాకు సర్వస్వం అని , అక్కడే ఉండటానికి నిశ్చయించి మా నాన్నతో సహా రూమ్ తీసుకుని గొలగమూడి లోనే ఉండి పోయాను.

నేను హాస్పిటల్‌లో నాన్నగారి కోసం 10 లక్షలు ఖర్చు పెట్టాను. కానీ స్వామి దయతో బ్రతికిన ఆయన, తర్వాత ఐదు సంవత్సరాలు ఇక్కడే ఉంటూ స్వామివారి మహాప్రసాదం సేవిస్తూ ఉన్నారు. నాన్నగారు కాలం చేసినప్పుడు కూడా, సకాలంలో అన్ని సాయాలు దొరికాయి.

*నా కుమారుడికి వచ్చిన కడుపు నొప్పి – వెంటనే తగ్గిపోవటం:*

మా పెద్దబ్బాయి నితిన్ కుమార్ బి.ఫార్మ్ పూర్తి చేశాడు. స్వామి దయతో 18 రోజుల్లోనే బెంగళూరులో ఉద్యోగం వచ్చింది. ఒకసారి, అబ్బాయి ట్రైనింగ్‌కు వెళ్లడానికి మూడు రోజులు ముందు, సరిగ్గా శనివారం స్వామి సేవకు వచ్చినప్పుడు, అబ్బాయికి సడెన్‌గా కడుపులో విపరీతమైన నొప్పి వచ్చింది. వెంటనే కారులో నెల్లూరులోని బాలకోటేశ్వర హాస్పిటల్ తీసుకెళ్లాం.

డాక్టర్ ఇంజెక్షన్లు ఇస్తే రాత్రికి తగ్గింది. కానీ మరుసటి రోజు ఉదయం మళ్లీ నొప్పి వచ్చింది. ఆ డాక్టర్ కడుపులో స్కానింగ్ (సిటీ స్కాన్) తీయమని చెప్పారు. ఆ రోజు ఆదివారం అయింది. స్కాన్‌లో చూసిన డాక్టర్, "నీ పొట్ట కింద సన్న నల్ల రాయి ఉంది" అని చెప్పి, ఏదో చేతితో ప్రెస్ చేసారు. తర్వాత, ఒక చిన్న బౌల్ ఇచ్చి, దాంట్లో కాటన్ పెట్టి పాస్ పోసుకొని తీసుకురా అన్నాడంట.

వెంటనే దాంట్లో ఆ స్టోన్ పడిపోయింది. ఆ మొత్తం ప్రాసెస్ ఐదు నిమిషాల్లో జరిగిపోయింది. డాక్టర్ కూడా "నీకు ఏం ప్రోబ్లం లేదు, ఈజీగా ఆ రాయి పడిపోయింది" అని చెప్పారు. తెల్లారి మూడు గంటలకు ట్రైన్‌లో 10 రోజులు ట్రైనింగ్‌కి వెళ్లాల్సిన అబ్బాయికి, ఎలాంటి భయం లేకుండా స్వామివారు ఆ నొప్పిని, రాయిని తీసి కొత్త జాబ్ లో ట్రైనింగ్ కి వెళ్ళటానికి ఆటంకం లేకుండా కాపాడారు. అప్పటి నుంచి ఇప్పటివరకు కడుపు నొప్పి గాని, ఎలాంటి ప్రాబ్లం గాని లేదు, ట్రైనింగ్‌కు కూడా ఎలాంటి ఇబ్బంది కాలేదు. మా అబ్బాయిని పర్మనెంట్‌గా నెల్లూరులోనే ఉండేలా చేయమని స్వామిని కోరుకున్నాను.

*నా పునర్జన్మ :*

2025 నవంబర్ 22వ తేదీ సాయంత్రం 5:40 గంటలకు నేను స్వామి వారి ప్రసాదం పెట్టి ఇంటికి వెళుతుండగా, కాలు జారి పడిపోయానంట (పడిపోవటం

నాకు తెలియదు). పడిపోయిన తర్వాత 15 నిమిషాలు నాకు శ్వాస రాలేదండి. అక్కడ ఉన్న గౌతం సార్‌తో సహా అందరూ చూశారు. 15 నిమిషాల తర్వాత 'హా' అని ఒక్క సారిగా శ్వాస తీసుకున్నానంట. నాకు వాంతులు అవుతూంటే బక్కెట్ పెట్టారు . అయ్యాయి మరియు కళ్ళు తిరిగాయి.

నేను పడినప్పుడు నా తల నేలకు తగిలి టెంకాయ సౌండ్ లాగా వచ్చిందని గౌతం సార్ చెప్పారు. నా పరిస్థితి చాలా సీరియస్ ఉందని, ఆ రాత్రి గడవడం కూడా కష్టమని డాక్టర్ వేణుగోపాల్ సార్ అన్నారు. అయినప్పటికీ స్వామివారు నన్ను కాపాడారు. గౌతం సార్ కూడా "నీది పునర్జన్మ" అని చెప్పారు. అంతకు ముందు రోజు రాత్రి, రమణమ్మ అనే ఆమెకు నేను చనిపోయినట్లుగా ఆమె ఏడుస్తున్నట్లు గా కల వచ్చింది.

ఈ కల "అలాంటిది జరుగుతుంది, కాపాడింది నేనే" అని స్వామివారు ఇచ్చిన చూపించిన ఋజువు (proof).ఒకవేళ నేను కొద్ది నిమిషాలు దాటిన తర్వాత వెళ్లి, స్కూటర్ పై నెల్లూరు వెళితే దారిలో ఏదైనా జరిగితే ఎవరికీ తెలిసి ఉండేది కాదు. స్వామివారు ఆయన సమక్షంలోనే నన్ను ఉంచుకొని అలా కాపాడారు.

*కుటుంబం పట్ల అనుగ్రహం:*

మా భార్య మా అత్తగారి ఇంట్లో ఉండేది. ఇక్కడికి రావటం అస్సలు ఇష్టం లేదు. స్థిరంగా మా భార్య కంప్లీట్‌గా నా దగ్గరికి అంటే గొలగమూడి రావాలి అని నేను స్వామిని అడిగాను. రెండున్నర సంవత్సరాల తరువాత తర్వాత పర్మనెంట్‌గా రాత్రికి రాత్రి లారీలో సామాను తో నీవు లేకుండా ఉండలేను ఇప్పుడే వచ్చేస్తాను అని చెప్పి వచ్చేశారు.

మా రెండో అబ్బాయి నవీణ్ కుమార్ అగ్రికల్చర్ డిగ్రీ, ఎంబీఏ పూర్తి చేయగా, ముత్తూట్ ఫిన్ కార్ప్‌లో బ్రాంచ్ మేనేజర్‌గా సెలెక్ట్ చేశారు.మా పిల్లలు తమ జీతంలో 10% ప్రతి నెల స్వామివారి హుండీలో కానుకగా వేస్తుంటారు.

*తక్కువ ఖర్చు కే పెళ్లి :*

నేను మా అబ్బాయికి పెళ్లి చేసినప్పుడు, మా గురువు గారి సలహా మేరకు, ఆడపిల్ల వాళ్ళ దగ్గర ఒక్క పైసా కూడా కట్నం తీసుకోకుండా పెళ్లి చేశాను. దాదాపు 9 లక్షలు ఖర్చు పెట్టాను.పెళ్లి మండపం (ఆర్వీఎస్ కళ్యాణ మండపం) సాధారణంగా 8-10 లక్షలు అడిగే చోట, మేనేజర్ స్వామి భక్తులు కావడం వలన లైటింగ్, ఏసీ, గదులు, శుభ్రపరిచే ఖర్చులతో సహా రెండు లక్షలకే పూర్తి చేశారు.మేనేజర్ స్వామి భక్తుడు కావటం అదే కళ్యాణమంటపం నేను బుక్ చేయటం వారికీ నేను తెలిసి అంత తక్కువ ఖర్చు కే కళ్యాణం జరగటం స్వామి కృపే! నా పిల్లలు తమ జీతంలో 10% ప్రతి నెల స్వామివారి హుండీలో వాటా

వేస్తుంటారు.

మా కుటుంబం అంతా స్వామి దయతోనే ఈరోజు ఆనందంగా ఉంది. అందుకే కృతజ్ఞత గా స్వామి దగ్గరే సేవ చేస్తూ ఉండిపోయాను.

*గత నాలుగు సంవత్సరాలుగా దినచర్య:*

• ఉదయం 5:30 గంటలకు ప్రసాదం పెడతాను.
• స్వామి గుడి చుట్టూ 11 ప్రదక్షిణలు, శివాలయం వద్ద 108 ప్రదక్షిణలు, ఆంజనేయ స్వామికి 11 ప్రదక్షిణలు చేస్తాను.
• మధ్యాహ్నం 11 గంటలకు మళ్లీ ప్రసాదం పెడతాను.
• 12:30 నుండి 2:00 గంటల వరకు భక్తులందరికీ అన్నం వడ్డిస్తూ  ఉంటాను.
• సాయంత్రం 5:30 గంటలకు మళ్లీ ప్రసాదం పెడతాను.
• 6:30 నుండి 9:00 గంటల వరకు అన్న ప్రసాదం వడ్డిస్తాను.
• రోజుకు కచ్చితంగా 10 గంటలు స్వామి సేవలో గడుపుతాను.

అధికారులు నాకు ఉద్యోగం ఇస్తామన్నా కూడా, స్వామివారికి ఉచిత సేవ చేయాలనే కోరికతో, నాకు డబ్బులు అక్కర్లేదు అని సున్నితంగా తిరస్కరించాను. నేను చాలా కఠినమైన నియమాన్ని పాటిస్తాను. నేను ఒక్క కప్పు ప్రసాదం కూడా ఇంటికి తీసుకెళ్లను. ఒకవేళ తినాలనిపిస్తే, డబ్బులు పెట్టి బయట కొనుక్కొని ఇంటికి తీసుకెళ్తాను. నా భార్య వచ్చినా, పిల్లలు వచ్చినా కూడా దర్శనం చేసుకుని డబ్బులు పెట్టి కొనుక్కొని తినమంటాను.

నేను ఏ చిన్న విషయం ఉన్నా, మా భార్య గురించి గాని, బిడ్డల గురించి గాని, అన్ని స్వామివారికే చెప్పుకుంటాను. నా మనస్సు ని పూర్తిగా వెంకయ్యస్వామి వారికి ఇచ్చేసాను. ఆయన దయవల్ల నాకు ఏది కూడా కష్టం అనిపించలేదు. అంతా స్వామి వారే నడిపిస్తున్నారు.

మా జీవితం స్వామివారి లీలలతో నిండిపోయింది. ఆయన అనుగ్రహం వల్ల నే నేను ఈ రోజు ఈ స్థితిలో ఉన్నాను. నేను ప్రహ్లాదుడిలా అయిపోయాను, స్వామి నా వెన్నంటే ఉన్నారు.

నారాయణరావు గారి జీవితంలోని సంఘటనలు  స్వామిపై ఆయనకు ఉన్న అచంచలమైన విశ్వాసాన్ని దృఢ పరిచి, స్వామి కృప ఒక విద్యుత్ ప్రవాహంలాగా  ప్రవహించి  ఆ శక్తి వారి జీవితాన్ని ప్రకాశవంతంగా వెలిగించింది..

ఓం నారాయణ - ఆది నారాయణ

శ్రీ దారా సురేష్, సత్తిపల్లి
జంగారెడ్డి గూడెం,ఏలూరు జిల్లా.



స్వామివారి పరిచయం నాకు 1995-97 ప్రాంతంలో దమ్మపేట సత్సంగాల ద్వారా లక్ష్మక్క వల్ల స్వామి గురించి తెలిసింది. నాటి నుంచి స్వామి వారి చరిత్ర పారాయణ చేయటం , ప్రదక్షిణ లు చేయటం, గొలగమూడి వస్తూ వారి దర్శనం చేసుకోవటం అలవాటు అయింది.

మా పాప కడుపులో ఉన్నప్పుడు (ఎనిమిదో నెలలో), భార్య గొలగమూడి దర్శనానికి వెళ్లాలని చాలా ఆర్తితో అడిగింది. ఎనిమిదో నెలలో అంత దూరం ప్రయాణం వద్దని నేను వారించగా, ఒకరోజు ఆమె కలలో స్వామి, సాయి బాబాగారితో కలిసి పల్లకీలో ఊరేగింపుగా వచ్చి, ఆమె పొట్టపై విభూతిని మొత్తం బాగా రాసి, శ్రీమంతం చేశారు.

మా పిల్లల పేర్లు కూడా స్వామి వారే పెట్టారు. కుమారుడు పుట్టకముందే, నాకు కలలో కనిపించి, "అక్షయ్ కుమార్" అని పేరు పెట్టుకోమని చెప్పారు.

మా రెండో పాప విషయంలో, భార్య కలలో భిక్షుకుని రూపంలో వచ్చి, మా ఇంటి వద్ద ద్రాక్ష పుడుతుందని సూచించారంట. తర్వాత పంతులుగారి సలహా మేరకు, లలితా పారాయణం నుంచి వచ్చిన "ద్రాక్షాయణి" అనే పేరును స్వామి పేరు కలిపి పెట్టాము.

*కల – నిజం :*

మా పాప పుట్టిన తొమ్మిది నెలలకు, ఒక రోజు రాత్రి నాభార్యకు ఒక భయంకరమైన కల వచ్చింది. కలలో, పాప గడప దగ్గర యూరిన్ పోసింది అది తొక్కడంతో నా కాలు జారిపడి, మెట్టు అంచు కు నా తల తగిలి రాయి లోపలికి గుచ్చుకుపోయి బ్లీడింగ్ అవుతున్నట్లు కనబడింది. ఆ కల లోనే హాస్పిటల్ కు తెసుకెళ్ళి నట్లు ,ఆపరేషన్ థియేటర్‌లో డాక్టర్లు కూడా ఏమి చేయాలో అని సందేహిస్తుంటే, స్వామి సాక్షాత్తూ ఆపరేషన్ థియేటర్‌లోకి వచ్చి, తన చేతిని నా తలపై, ఆ బుర్రలోనే పెట్టి, ఆ రాయిని తీసినట్లు చూపించారు. కలలోనే ఈ భయంకర దృశ్యం కనిపించినా, నేను ఏడ్చి అరుచుకుంటూ నిద్రనుంచి లేచాను. ఆమరుచటి రోజు రాత్రి నిజంగానే మా పాప ఆ గడప వద్ద యూరిన్ పోయడం, నేను నీళ్ళు తీసుకోడానికి వెళుతుంటే కాలు జారిపడి, బింది తగిలి చిన్న గాయం అవ్వడం జరిగింది. కలలో నేను ఏ చీర కట్టుకున్నానో అదే చీర ఆరోజు కట్టుకున్నాను. అన్నీ కలలో ఎలా ఉన్నాయో అలాగే జరిగాయి ఒక్క తల పగలి ప్రమాద కరమైన దెబ్బ తగలటం తప్ప. ఎంతో పెద్ద ప్రమాదం జరుగవలసిన కర్మ ను స్వామి చిన్న గాయంతో తప్పించారని అనిపించింది.

*నన్నెందుకు అడగలేదు ? :*

2020లో కరోనా టైంలో, నా స్నేహితుడి తమ్ముడు చనిపోతే, నేను మాస్కు, శానిటైజర్ కూడ లేకుండా అక్కడికి వెళ్ళి అక్కడ పని చేశాను. తరువాత నాకు , నా భార్యకు, కొడుకుకు కూడా జ్వరం వచ్చింది. స్వామీ నాకు వేరే దిక్కు లేదు ఇంత మందికి కరోనా వస్తే నా పరిస్థితి ఏమిటి ? నా దగ్గర హాస్పిటల్ కి కట్టడానికి లక్షలు డబ్బులు లేవు, నీవే దిక్కు అని స్వామి పాదాల దగ్గర నాలుగు కొబ్బరికాయలు (నలుగురి పేరున) పెట్టి, రేపు పొద్దున్న అంతా బాగుంటే మళ్ళీ వచ్చి కొబ్బరికాయలు వేస్తానని ఆర్తితో మొక్కుకున్నాను. అద్భుతంగా తెల్లవారికి అందరికీ జ్వరం తగ్గింది . మా కొడుకు చిన్నవాడు వచ్చి, రాత్రి స్వామి (తంబుర పట్టుకుని) వచ్చి అందరికీ విభూది బొట్టు పెట్టారని చెప్పాడు. ఒక్క టాబ్లెట్ కూడా వేసుకోకుండా, స్వామి దయ వల్ల ఈ గండం నుండి బయటపడ్డాము.

మరోసారి, అమ్మవారు (పొంగులు) వచ్చి మా బాబు 15 రోజులు ఆహారం తీసుకోలేక చాలా బాధపడ్డాడు. అది తగ్గిన తరువాత మా పాపకు మొదలైంది. ఆ సమయంలో నేను బాధపడి, అమ్మవార్లందరికీ దండం పెట్టుకున్నా కానీ, స్వామిని అడగలేదు.

అప్పుడు స్వామి కలలో కనిపించి, "నువ్వు ఇన్ని ముక్కులు మొక్కావు, ఇంతమంది అమ్మవార్ల కు దండం పెట్టుకున్నావు, కానీ నాకు ఏం చేసావు? నన్ను ఎందుకు అడగలేదు?" అని అడిగారు. మరుసటి రోజు ఆర్తితో స్వామికి భజన, నామ స్మరణ చేయిస్తానని మొక్కుకొని దండం పెట్టుకున్న వెంటనే తగ్గటం ప్రారంభించి పాపకు అమ్మవారు కొద్ది రోజుల్లో తగ్గిపోయింది.

*గృహ నిర్మాణం, (2019-2026):*

2019లో నాకు ఇల్లు లేనప్పుడు, స్వామి భక్తుడైన చైతన్య అనే వ్యక్తి ద్వారా ఒక ఇల్లు చూశాను. నా దగ్గర రూపాయి కూడా లేకున్నా, భార్య కలలోకి వచ్చి, "ఆ ఇల్లు కొనుక్కో అమ్మ" అని స్వామి చెప్పారంట. ఇల్లు అమ్ముతున్న వ్యక్తి, 25 లక్షలకు రూపాయి కూడా తగ్గించను అని దండం పెట్టుకొని గొలగమూడి వచ్చారు. ఆ వ్యక్తి తండ్రి ఇల్లు అమ్మడానికి ఒప్పుకోకపోతే, స్వామి కలలో కనిపించి, నన్ను చూపించి, "ఈయన దక్షిణ ఇస్తారు, తీసుకొని వెళ్ళిపో" అని చెప్పారంట. ఆ ఇల్లు కొనడానికి ₹25 లక్షలు అవసరం కాగా, స్వామి కల్పించుకొని, సమయానికి ఆ డబ్బులు సమకూర్చారు. ఆవిధంగా స్వామి వారే నాచేత ఇల్లు కొనిపించారు .

ఇటీవల ఒక కంపెనీ వారి కారణంగా వచ్చిన ఆర్థిక ఇబ్బందుల వల్ల ఇల్లును బాకీ ఉన్న అతనికే అమ్మేయాలని తీవ్రంగా బాధపడుతుంటే, ఆ వ్యక్తికి స్వామి మనసులో ప్రవేశించి ఉంటారు. ఆయనే నన్ను పిలిచి, "నాకు నీ ఇల్లు వద్దు. మీకు ఆరు నెలలు టైం ఇస్తాను" అని స్టాంపు పేపర్ కూడా లేకుండా మాట ఇచ్చి వెళ్ళిపోయారు. స్వామి వారే నా సమస్య తీరుస్తారు అనే నమ్మకం ఉంది.

స్వామి కలలో చెప్పిన మేరకు నా భార్య స్వామి వారి గుడికి నడిచి వెళ్ళి 108 రోజులు పాటు ప్రదక్షిణలు చేయగా, నేను కూడా జనవరి 29 నుంచి నేటి వరకు ప్రతి రోజు బ్రేక్ లేకుండా గత10 నెలల నుంచి ప్రదక్షిణలు కొనసాగిస్తున్నాను.

స్వామి దయతో, ఇన్ని విపత్తుల నుంచి బయటపడి, మేము ఈ రోజు జీవించి ఉన్నామంటే, అది ఆయనే కారణం. చాలాసార్లు "నా బిడ్డలను నేను కాపాడుకోనా?" అని స్వామి మాకు కనిపించి చెప్పిన సందర్భాలు వందల సార్లు ఉన్నాయి. ఆయన ఆశీస్సులు ఎల్లవేళలా రక్షణ కవచంలా మమ్మల్ని కాపాడుతున్నాయి.

ఓం నారాయణ – ఆదినారాయణ

శ్రీమతి సుమతి, SBI,
నెల్లూరు.

శ్రీమతి సుమతి గారు ( సుమతి అక్క ) శ్రీ పెసల సుబ్బరామయ్య గారి పుత్రిక. ఈమె తను చదువు కంప్లీట్ చేసి జాబ్ కోసం కఠోర మైన దీక్ష చేసి ( కేవలం రోజుకు ఒక tea కప్పు లో కొలిచి అన్నం తిని ) వెంకయ్య స్వామి అనుగ్రహం తో job సాధించింది. ఇప్పుడు Nellore లో sbi పని చేస్తున్నారు . సుబ్బరామయ్య సర్ ఆమె ఈ దీక్ష గురించి ఎంతో మెచ్చుకునే వారు. ఈ మధ్య జరిగిని ఒక లీల గురించి ఇలా వివరిస్తునారు

గత నాలుగు, ఐదు నెలల క్రితం నేను ఒక చాలా పెద్ద సమస్యను ఎదుర్కొన్నాను. ఈ సమస్య ఎంత తీవ్రంగా ఉందంటే, అది లైఫ్ అండ్ డెత్ ప్రాబ్లం (ప్రాణాపాయ సమస్య) అని కూడా అనుకోవచ్చు. ఈ సమస్య తీరిపోవాలని నేను బాబాకి చాలా చెప్పుకున్నాను, ఒక నిర్దిష్ట సమయం లోపల సమస్య పరిష్కారం కావాలని మొక్కుకున్నాను.నా ప్రార్థన స్వామి వారు విన్నారు కోరిన సమయం లోనే సమస్య తీర్చారు.

ఈ సమస్య పరిష్కారం కోసం నేను చాలా రకాలుగా నిష్టతో కూడిన సాధనలు చేశాను. వాటిలో కొన్ని:

• ప్రదక్షిణలు చేయడం, స్వామి లీలలు పారాయణం చేయడం.
• జప మాల తో నామజపం చేయడం.
• నాకు ఇష్టమైన కొన్ని భోజన పదార్థాలు వదిలేయడము.
• ధునిలో కాయలు సమర్పించడము.

ఇది ఈమధ్యే నవంబర్ (2025), జరిగిన సంఘటన. సుమారు రాత్రి 1:00 గంట నుంచి 2:00 గంటల మధ్యలో, నేను వాష్ రూమ్ నుంచి బయటికి వచ్చాను. మా మాస్టర్ బెడ్ రూమ్ డ్రెస్సింగ్ రూమ్ దగ్గర మ్యాట్స్ ఉంటాయి. ఎన్నిసార్లు బాత్రూమ్ కి వెళ్లి ఉన్నా పడని నేను, ఆ రోజు మటుకు తడి కాళ్లతో వచ్చి,

ఒక్కసారిగా జారి పడిపోయాను.

నాకు అంతకుముందు డిస్క్ బల్జ్ సమస్య, సయాటిక్ నర్వ్ నొప్పి ఉండింది. సరిగ్గా నేను పడిపోయినప్పుడు, ఎక్కడ నొప్పిగా ఉందో అది నేలకు గట్టిగా తగిలి నాకు ప్రాణం పోయినట్లు అనిపించింది. ఆ పడే బాధలో నేను మొదట "అమ్మా, అమ్మా " అని ఐదు, ఆరు సార్లు అనుకున్నాను. ఆ వెంటనే తేరుకొని,నేను స్వామి ని కదా తలుచుకోవాలి,అమ్మని ఎందుకు తలచుకుంటున్నాను అని గుర్తొచ్చింది. ఒక్క సారిగా విపరీతంగా ఏడుపు వచ్చేసింది. నాకు ఎప్పుడు ఏడుపు రాదు . నేను శరీకంగా బాధపడి గాని ,మా నాన్న ,అమ్మ చని పోయినప్పుడు కూడా ఏడవలేదు.ఇప్పుడు మాత్రం పెద్దగా ఏడ్చాను.

ఆ తర్వాత నేను సపోర్ట్ తీసుకున్నా కూడా లేవలేకపోయాను. ఎలాగోలా బెడ్ దగ్గరికి వెళ్లి చిన్నగా ఎక్కి పడుకునేసాను. హైదరాబాద్ లో ఉన్న నా కుమారుడిని రమ్మని చెప్తే నా కోసం వచ్చేశాడు.నేను భయపడింది ఏమంటే, లిగమెంట్ చీలిక అయ్యి ఉంటుందేమో అని. లిగమెంట్ చీలితే మూడు, నాలుగు నెలలు బెడ్ రెస్ట్ తీసుకోవాల్సి వస్తుంది. నేను అప్పుడు స్వామిని, "స్వామి, నాకు నువ్వు హాస్పిటల్ లో ఉండే పరిస్థితి వద్దు, బెడ్ రెస్ట్ వద్దు. ఇంకేదైనా పెట్టు, మాత్ర వేసుకుంటా తిరుగుతా ఉంటా, అంతేగాని పండపెట్టొద్దు నన్ను" అని ప్రార్థించు కొన్నాను .డాక్టర్ దగ్గరికి వెళితే నేను గతంలో ఎన్నో సార్లు వెళ్ళినా ఎక్స్రే తీయమని అడిగేవాడు. కానీ ఈసారిడాక్టర్ స్కానింగ్ గానీ, ఎక్స్రే గానీ ఏమీ రాయలేదు. కేవలం ఒక పెయిన్ కిల్లర్, గ్యాస్ మాత్ర, మరియు తక్షణ నొప్పి తగ్గడానికి ఒక ఇంజెక్షన్ ఇచ్చి, ఐదు, ఆరు రోజులు బెడ్ రెస్ట్ తీసుకోమని చెప్పాడు.

నా ప్రార్థన ఫలించింది. కేవలం బాబా దయ, స్వామి దయ వల్ల మాత్రమే లిగమెంట్ టేర్ అవ్వకుండా కాపాడింది. నాకు ఆ భయాంకరమిన నొప్పి (బాధ)ని అనుభవించాలని ఉండింది, అందుకే అదిరింది అంతే. లిగమెంట్ టేర్ అయితే త్రీ, ఫోర్ మంత్స్ పడుకోవాలి, కానీ ఇప్పుడు నేను శుభ్రంగా అన్ని పనులు చేసుకుంటున్నాను. నేను 100% నమ్మేది ఏమంటే, అది కేవలం స్వామి దయ, బాబా దయ అంతే.నేను వెంకయ్య స్వామివారి దగ్గరికి నెలకు ఒకసారి వెళ్తాను. అలాగే, ప్రతి వారం బాబా టెంపుల్ కి వెళ్తాను. మేము నెల్లూరుకి వచ్చిన తర్వాత, సుమారు 15 సంవత్సరాల నుంచి స్వామి గుడికి వెళ్తూ ఉన్నాను. ఆరోగ్యం బాగాలేనప్పుడు కూడా కంటిన్యూ చేశాను. ఇందు వల్లనే స్వామి నన్ను కష్టాల నుండి కాపాడుతున్నారు.

ఓం నారాయణ – ఆదినారాయణ

శ్రీ సోమిన శివప్రసాద్,
అసిస్టెంట్ డివిజనల్ ఇంజనీర్ ( రిటైర్డ్ ) NTPS,
విజయవాడ.



నేను విజయవాడలోని నారా తాతారావు థర్మల్ పవర్ స్టేషన్ (ఎన్టీపీఎస్) లో అసిస్టెంట్ డివిజనల్ ఇంజనీర్‌గా రిటైర్ అయ్యాను. నేను భరద్వాజ్ మాస్టర్ గారి మార్గంలో ఉండి, వారి పుస్తకాలు, మహాత్ముల చరిత్రలు చదువుకునేవాడిని. శ్రీ వెంకయ్య స్వామి వారి చరిత్ర పారాయణ చేయడం నాకు అలవాటు.

మొదటి సందర్శనలో స్వామివారి లీలలు:

1998వ సంవత్సరంలో, దత్త క్షేత్రాల యాత్రకు వెళ్ళేటప్పుడు, నేను మొదటిసారిగా గొలగమూడి చేరుకున్నాను. మేము వెళ్లేసరికి సమయం దాదాపు 2:30 నుంచి 3:00 గంటలు అయ్యింది. విపరీతమైన ఆకలి అవుతున్నప్పటికీ, అంత రద్దీలో (శనివారం), స్వామివారి భోజన ప్రసాదం దొరుకుతుందా లేదా అని మనసులో అనుకుంటున్నాను. నేను గోడకి ఉన్న కుళాయి దగ్గర కాళ్ళు కడుక్కొని లోపలికి వెళ్దామని వస్తుంటే, అంత రష్‌లో నుంచి ఒక రైతులా ఉన్న వ్యక్తి—పంచె కట్టుకొని, భుజం మీద కండువా వేసుకుని—గబగబా నా దగ్గరికి వచ్చారు. ఆయన నన్ను ఆపి, "ఇవాళ నువ్వు ప్రసాదం తీసుకొని వెళ్ళాలి" అని చెప్పి, జనం మధ్యలో కలిసిపోయారు. ఆయనేవరో నాకు తెలియదు. నా మనసులో ఉన్న ఆలోచనకు వెంటనే జవాబు దొరకడం వండర్‌గా అనిపించింది, ఆ రోజు మాకు భోజనం దొరికింది.

ఆ తర్వాత, నేను గుడి బయట నిలబడి కెమెరాతో ఫోటోలు తీస్తుండగా, పదిహేనేళ్ల కుర్రాడు ఒకరు వచ్చి, స్వామి అనుమతి లేకుండా ఫోటోలు తీయకూడదని, స్వామికి కోపం వస్తుందని నన్ను వారించాడు.

నేను ఆ కుర్రాడిని పట్టించుకోకుండా ఫోటోలు తీశాను. అయితే, రీల్ మొత్తం వైట్ వచ్చింది. ఒక్క ఫోటో కూడా రాలేదు. అప్పుడే నాకు స్వామి సామాన్యుడు కాదని అర్థమైంది.

*వేలు ముద్రలు లభించడం :*

సుమారు 2000 సంవత్సరంలో, మేము విశాఖపట్నం స్టీల్ ప్లాంట్ లో అఖిలాంధ్ర సాయి మాస్టర్ భక్త సమ్మేళనం ఏర్పాటు చేయాలని నిర్ణయించుకున్నాము. ఈ సందర్భంగా, మేము గొలగమూడి వచ్చి స్వామివారి సేవకులు, డైరెక్ట్ శిష్యులు అయిన పెసల సుబ్బరామయ్య గారిని కలుసుకున్నాము. నేను వారిని స్వామివారి వేలు ముద్రలు ఇవ్వమని అడిగాను. దానికి ఆయన, "అయ్యో శివప్రసాద్, నువ్వు అడిగినందుకు నా దగ్గర ఒక్కటి కూడా లేదయ్యా, ఎవరైనా కష్టాల్లో వస్తే ఇచ్చేస్తాను," అని బాధపడ్డారు. నాకు అర్హత లేనిదానిని

అడిగానేమో అని నేను మనసులో బాధపడ్డాను.

ఈ సంఘటన జరిగిన రెండు రోజుల తర్వాత, మధ్యాహ్నం 1:00 గంటకు నేను ప్లాంట్‌కి వెళ్లడానికి షిఫ్ట్ బస్ ఎక్కాను. నా పక్కన మాధవరావు అనే జూనియర్ ప్లాంట్ అటెండెంట్ వచ్చి కూర్చున్నాడు. అతను వెంకయ్య స్వామి భక్తుడు. అతను సడన్‌గా నన్ను అడిగారు, "సార్, నేను ఒకటి విషయం చెప్తాను మీకు ఏమనుకోరు కదా... భగవాన్ వెంకయ్య స్వామివారి వేలు ముద్రలు ఉన్నాయి నా దగ్గర మీరు తీసుకుంటారా?" అని. అక్కడ (గొలగమూడిలో) దొరకలేదని బాధపడిన నాకు, స్వామివారు ఈ రూపంలో వచ్చి "నీకు ఇస్తున్నాను" అని చెప్పినట్టుగా అనిపించింది. అది నిజంగా చాలా అద్భుతం. మరుసటి రోజు ఆయన ఒక న్యూస్ పేపర్ నిండా వేలు ముద్దలు తెచ్చి ఇచ్చారు. వాటిని మహాప్రసాదంగా ఫోటో కట్టి ఇప్పటికీ నేను ప్రతి నిత్యం పూజ చేసుకుంటాను.

*నా శ్రీమతికి ,సహోద్యోగుల అనుభవాలు :*

మా శ్రీమతికి సయాటికా (Sciatica) నొప్పి ఉండేది, ఎక్కువ సేపు కూర్చోలేకపోయేది. ఆమె రోజూ బిషగ్వవరేణ్యుడు  అధ్యాయం (ఆరో అధ్యాయం) చదువుకుంటుంది. మేము వెంకయ్య స్వామి విభూదిని తీర్థంలో కలిపి, "ఓం నారాయణ ఆదినారాయణ" అని జపించి ఉదయం తీసుకుంటాము.

2012-2013 ప్రాంతంలో నేను రాజమండ్రికి వచ్చిన తర్వాత, ఒకసారి ఆమె ఇంట్లో పడిపోయి, మోకాలు నొప్పి, సయాటికా నొప్పి బాగా ఎక్కువైంది. ఆమె స్వామికి మొక్కుకుంది—గొలగమూడికి వచ్చి ప్రదక్షిణ చేస్తానని. మేము వెళ్ళినప్పుడు, ఆమెకు నొప్పి కారణంగా ప్రదక్షిణ చేయలేకపోతే, గోడ మీద రాసి ఉన్న స్వామివారి సూక్తిని చూసింది. అందులో, "నొప్పి ఎంత అనుభవిస్తే  అంత మంచిది కదయ్యా" అని ఉంది. నొప్పి ప్రారబ్ధాన్ని తీరుస్తుందని ఆమె భావించింది. ఇంటికి వచ్చేటప్పటినుంచి  ఆమెకు ఆ తీవ్రమైన నొప్పి లేదు. స్వామి దీపారాధన నూనె రాసుకోవడం వలన కూడా ఆమెకు నొప్పి తగ్గింది. ఇంత కంటే తగ్గించాలని మరి  కోరుకోలేదు.

నేను నా సహోద్యోగులకు ఏ సమస్య వచ్చినా, గురు చరిత్ర, లీలామృతం మరియు వెంకయ్య స్వామి చరిత్ర మూడు పుస్తకాలు పారాయణ చేయమని చెప్తాను.

నా సహోద్యోగి గుప్తా ( డివిజనల్ ఇంజనీర్ ) కు జరిగిన అనుభవాలు:

- ఒకసారి జనరేటర్ కాలిపోయినందుకు అతనికి ఛార్జ్ షీట్ వచ్చింది. పారాయణ చేసుకున్న తర్వాత, అతని వివరణను ఉన్నతాధికారులు అంగీకరించారు.
- మళ్ళీ, అతనికి వేరే ప్లాంట్‌కు ట్రాన్స్‌ఫర్ అయినప్పుడు,అది తప్పించమని కోరుకుని  పారాయణ చేసుకుంటే ఆ ఆర్డర్ వెంటనే క్యాన్సిల్ అయింది.
- మూడవసారి, ఒరిస్సాలోని పనిష్మెంట్ ఏరియాకు ప్రమోషన్ తో సహా

ట్రాన్స్‌ఫర్ అయినప్పుడు, స్వామిపై అపార నమ్మకంతో ప్రార్థించి మళ్ళీ పారాయణ చేశాడు. మరుసటి రోజునే అతనికి రిటెన్షన్ ఆర్డర్ వచ్చి, అతను తిరిగి వీటీపీఎస్ లోనే కొనసాగాడు.

*ఈ మధ్యకాలం లో జరిగిన లీలలు:*

తణుకుకు చెందిన మా మరదలి భర్త (కనకదండి వాసు) ఇటీవల రెండు కిడ్నీలు పాడై, హార్ట్‌బీట్ తగ్గి, రాజమండ్రిలోని ఐసీయూలో సీరియస్‌గా ఉన్నారు. నేను ఐసీయూలోకి వెళ్లి, స్వామివారి దారాలు అతని తల కింద పెట్టాను. మా మరదలికి ఆరో అధ్యాయం పారాయణ చేయమని, వెంకయ్య స్వామి విభూదిని నీళ్లలో కలిపి “ఓం నారాయణ ఆదినారాయణ” అని జపించి తాగమని చెప్పాను.

ఆ కుటుంబం ఆర్థికంగా ఇబ్బందుల్లో ఉన్నందున, హాస్పిటల్స్ ఆరోగ్యశ్రీ బిల్లులు పెండింగ్‌లో ఉండటం వలన ఆపరేషన్‌కు ఒప్పుకోలేదు. అయితే, మేము పారాయణ మొదలుపెట్టిన వెంటనే, ఆ హాస్పిటల్ వారు ఆరోగ్యశ్రీ పథకాన్ని ఒప్పుకున్నారు, వారికి ఐదు లక్షల వరకు చికిత్సకు అవకాశం ఇచ్చారు. ఆపరేషన్ చక్కగా జరిగి అతనికి ఆరోగ్యం చక్కబడింది.

పాలచర్ల ప్రాంతానికి చెందిన కనకలక్ష్మి అనే రైతు కుటుంబం పంట దిగుబడి సరిగా రాలేదని బాధపడుతుంటే, నేను ఆమెకు మూడు లేక నాలుగు సప్తాహాలు (వారం రోజులు) వెంకయ్య స్వామి చరిత్ర పారాయణ చేయమని చెప్పాను. పారాయణ చేస్తున్నప్పుడు, స్వామి ఆమె కలలోకి వచ్చి, "ఈ సంవత్సరం నుంచి నీకు 5 లక్షలు నేను ఇస్తుంటాను" అని చెప్పారు. అలాగే పత్తి పంట అమ్మి ఆమెకు మంచి లాభం వచ్చింది. లోకం కోసం, నిస్వార్థంగా త్రికరణ శుద్ధిగా స్వామిని నమ్మితే తప్పకుండా సమస్యలు పరిష్కారం అవుతాయని నా దృఢ నమ్మకం.

మరొక భక్తుడు, తూర్పు గోదావరి జిల్లా కోరుమిల్లికి చెందిన జానకి రామయ్య, ఎప్పుడు స్వామి వారి పారాయణ, భజనలు చేసేవారు. కరోనా సమయంలో, అతనికి వైరస్ సోకినప్పుడు, ఒక తెల్లవారుజామున స్వామి మంచం దగ్గర కూర్చుని, "నీకు ఎందుకు, నేను తీస్తాను కదా నీ బాధ" అని చెప్పారు. వెంటనే అతను కుటుంబంతో కాకినాడ నుంచి శేషాద్రి ఎక్కి గొలగమూడి చేరుకుని మూడు రోజులు నిద్ర చేసి వచ్చారు. ఆయన తన జీవితంలో జరిగిన మంచికీ, కూతురి వివాహానికీ స్వామి కృపే కారణమని చెప్తారు.స్వామివారు ఇలాంటి అద్భుతమైన లీలలు నాకు మరియు నన్ను నమ్మి నా సలహా తీసుకున్న ఎంతోమంది భక్తులకు చూపుతున్నారు. నాకు, నా బంధు మిత్రులకు , సహచరులకు జరిగిన ఈ అనుభవాలన్నీ స్వామివారి కృపే.

ఓం నారాయణ – ఆదినారాయణ

శ్రీ వెంకటేశ్వర్లు,
ఆర్.ఎం.పి. వైద్యులు,
గొలగమూడి.



గొలగమూడి లో ఆర్.ఎం.పి. వైద్యులుగా సేవలు అందిస్తున్న శ్రీ వెంకటేశ్వర్లు 2006వ సంవత్సరం నుండి గొలగమూడిలోనే నివాసము ఉంటున్నారు,. వెంకయ్యస్వామి వారిపై అపారమైన విశ్వాసము కలిగియున్న డాక్టర్ గారు, వృత్తిని ప్రారంభించక ముందు, నెల్లూరు అయ్యప్ప గుడి ప్రాంతం నుండి సైకిల్‌పై స్వామి వారిని దర్శించుటకు వచ్చేవారు.

వైద్య వృత్తిని ప్రారంభించాలనే సంకల్పము కలిగిన తరువాత , స్వామి వారి దయ వలన అన్నీ అనుకూలముగా చక్కగా జరిగాయిభవిష్యత్తులో జరగబోయే విషయాలు స్వామి వారి కృప వలన మంచి సంకేతాలు తరచుగా స్వప్నములో కనిపించేవి,. వారి వైద్యశాల అభివృద్ధి, ఆదాయము ఎలా ఉండబోతుందనే విషయాలు కూడా స్వప్నములో అర్థమయ్యేవి.

వారు గృహ నిర్మాణము చేపట్టి, అప్పు చేయవలసి వచ్చిన సమయంలో, ఎటువంటి ఇబ్బంది లేకుండా పని పూర్తి అవుతుందని, కలలో ఎవరో చెప్పినట్లుగా కనిపించి , నిజంగా కూడా ఏ ఇబ్బందీ లేకుండా జరిగింది. మరొక కల వచ్చి డబ్బుకు చెదలు పట్టినట్టుగా కనిపించింది. అత్యధికంగా డబ్బులు వస్తాయని దానికి ఈ కల స్వామి వారిచ్చిన నిదర్శనం అనే దృఢ భావం కలిగింది. అదే ధైర్యం తో అప్పు చేశారు. 2011వ సంవత్సరంలో గృహ నిర్మాణము జరిగింది

*సంతాన ప్రాప్తి:*

వెంకటేశ్వరులు గారి కి 16 సంవత్సరాలుగా పిల్లలు లేరనే బాధ ఉండేది. వెంకయ్యస్వామి వారిని ప్రార్థించగా, స్వామి వారు ప్రత్యక్షంగా కనిపించకుండా, ఫలముల (పండ్ల) రూపములో చూపించారు. గుడికి వచ్చే ఇతర భక్తుల ద్వారా, గుంటూరులోని ఒక ప్రాంతానికి వెళ్లమని సలహా లభించింది. ఆ సలహా పాటించి చికిత్స చేయించుకోగా, వారికి ఒక బాబు జన్మించాడు.

*ధర్మనిరతి- రక్షణ :*


ఒకసారి శత్రువు నుంచి తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఆ ఇబ్బంది వెంకయ్య స్వామి (గుడి)సమక్షం లోనే తొలగించి స్వామి ఆ ఇబ్బంది తొలగించారు.

వారి ధర్మనిరతి , సేవా దృక్పథం వెంకయ్య స్వామి కృపకు కారణం. ఆయన ఎంతో కష్టపడి పైకి వచ్చారు. రోగుల వద్ద నుండి డబ్బులు తీసుకోవాలంటే వచ్చిన వారికి ఎలా వస్తాయని ఆలోచించే వ్యక్తిత్వం, డబ్బును ఆశించకుండా, ప్రేమగా రోగులను చూసుకోవడం, ఒక్కోసారి రోగులు డబ్బు ఇవ్వకపోయినా,

తరువాత ఇస్తామన్నా కూడా సర్దుబాటు చేసుకోవడం దేవునికి నచ్చే విషయాలు. స్వామి వారు కోరేది  సత్యం , ధర్మము. వీటిని పాటిస్తే స్వామి వారి కృప వద్దన్నా వెల్లువ లా కురుస్తుంది .

ఓం నారాయణ – ఆదినారాయణ

.



# మా ఇతర ప్రచురణలు

| క్ర.సం. | పుస్తకము పేరు | ధర. |
|---|---|---|
| 1 | వార్తాలాపము | 250 |
| స్వామిని గురించిన పుస్తకములు | | |
| 2 | అవధూత లీల, తెలుగు | 40 |
| 3 | అవధూత లీల, తెలుగు బైండింగ్ | 80 |
| 4 | అవధూత లీల తమిళ్ | 60 |
| 5 | అవధూత లీల కన్నడ | 80 |
| 6 | అవధూత లీల ఇంగ్లీషు | 30 |
| 7 | అవధూత లీల హిందీ | 60 |
| 8 | శ్రీ వెంకయ్య స్వామి, హిందీ | 5 |
| 9 | స్వామి సన్నిధి | 15 |
| 10 | అవధూత బోధామృతము | 15 |
| 11 | చూచి నేర్చుకో | 15 |
| 12 | గురుస్తుతి | 10 |
| 13 | బాలల వెంకయ్యస్వామి | 35 |
| 14 | అవధూత లీల CD | 20 |
| 15 | శ్రీ వెంకయ్యస్వామి, ENG | 5 |
| 16 | స్వామి కృప తెలుగు | 5 |
| 17 | స్వామి కృప తమిళ్ చిన్నవి | 5 |
| 18 | పిలిచిన పలికే దైవం | 5 |
| 19 | వెన్నెల పూలు | 5 |
| 20 | మౌన బోధ | 5 |
| 21 | బోధ యజ్ఞాయ నమః | 5 |
| 22 | ధర్మ మూర్తి | 5 |
| 23 | దివ్య లీలలు | 5 |
| 24 | వాళ్ళు ఉండే దాన్ని బట్టి గదయ్యా మన | 5 |
| 25 | స్మృతి రహిత ప్రసన్నాయ నమః | 5 |
| 26 | స్మృతి మాత్ర ప్రసన్నాయ నమః | 5 |
| 27 | స్వామి అనుగ్రహము | 5 |
| 28 | సర్వ సమర్థుడు | 5 |
| 29 | నమ్మలేని పచ్చి సత్యాలు | 5 |
| 30 | నమ్మిన వారికి సొమ్ము నమ్మని వారికి | 5 |
| 31 | శ్రీ వెంకయ్య స్వామి పూజ | 5 |
| 32 | వెంకయ్య స్వామి ఆరతులు | 10 |
| 33 | వెంకయ్య స్వామి భజన | 2 |
| 34 | అసాధ్యము-సుసాధ్యము | 5 |
| 35 | విశ్వాసం – విజయం | 10 |
| శ్రీ ఎక్కిరాల భరద్వాజ మాస్టర్ గురించిన పుస్తకములు | | |
| 36 | శ్రీసాయి మాస్టర్ బోధామృతాము | 60 |
| 37 | అమృత వాక్కులు | 5 |
| 38 | మృత్యువుపై ఘన విజయము | 5 |

| క్ర.సం. | పుస్తకము పేరు | ధర |
|---|---|---|
| 39 | శుద్ధ చైతన్య మూర్తి | 5 |
| 40 | శ్రీ భరద్వాజ భక్తుల అనుభవాలు | 5 |
| 41 | మన ధర్మము - కర్తవ్యము | 5 |
| 42 | మాస్టర్‌గారి సత్సంగము | 15 |
| సద్గురు శ్రీ సుబ్బరామయ్య మహరాజ్ (గొలగమూడి) గురించిన పుస్తకములు: | | |
| 43 | సార్ లేఖలు -1 | 15 |
| 44 | సార్ లేఖలు-2 | 25 |
| 45 | సార్ లేఖలు - 3 | 10 |
| 46 | సార్ సన్నిధి | 20 |
| 47 | పురుషప్రయత్నం-గురు అనుగ్రహం | 5 |
| 48 | పతి సేవే పరమాత్మ సేవ 1 | 5 |
| 49 | పతి సేవే పరమాత్మ సేవ 2 | 5 |
| 50 | శ్రద్ధ (SS 0) | 5 |
| 51 | విశ్వగురుచింతన (SS 1) | 5 |
| 52 | సాధన (SS 2) | 5 |
| 53 | శ్రమతో సేవ-సేవతో కైవల్యం | 5 |
| 54 | పరోపకారార్థ మిదం శరీరం | 5 |
| 55 | శ్రీ సుబ్బరామయ్య మహారాజు భక్తుల అనుభవాలు | 25 |
| ఇతర మహనీయుల గురించి న వివిధ పుస్తకములు : | | |
| 56 | ధునివాలా దాదా | 15 |
| 57 | సాయి కృప | 5 |
| 58 | దైవం మానుష రూపేణ (పెద్దది) | 60 |
| 59 | దైవం మానుష రూపేణ(దర్గా స్వామి) | 5 |
| 60 | యర్ర దర్గా స్వామి | 5 |
| 61 | రంగన్న బాబు | 10 |
| 62 | నల్ల మస్తాన్ బాబా | 5 |
| 63 | అవధూతేంద్ర స్వామి | 5 |
| 64 | నరోపా జీవిత చరిత్ర | 5 |
| 65 | పూండి స్వామి | 10 |
| 66 | నాంపల్లి బాబా (హైదరాబాద్) | 10 |
| 67 | మాయి అమ్మ (సేలం) | 5 |
| 68 | శివనేశన్ స్వామి (షిర్డి) | 10 |
| 69 | శివుని ఆజ్ఞ (శ్రీ వెంకటేశ్వర స్వామి) | 10 |
| 70 | కంచి పరమాచార్య part 1 | 40 |
| 71 | కంచి పరమాచార్య part 2 | 40 |
| 72 | సుధీంద్ర బాబు | 5 |
| 73 | నామ కోటి(ఓం నారాయణ, ఆది నారాయణ) | 20 |
| 74 | శ్రీరామ నామ కోటి | 15 |



సూచన :

భగవాన్ వెంకయ్య స్వామి వారి భక్తులు ఎవరైనా తమకు జరిగిన దివ్య అనుభవాలను మాతో పంచుకోవచ్చు. అవకాశాన్నిబట్టి వాటిని మా తదుపరి రచన లో ప్రచురణకు పరిశీలిస్తాం.

కాంటాక్ట్-నంబర్ : 7019123548